PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 36 | విజయవాడ, మంగళవారం 5 సెప్టెంబర్ 2023 | 6+8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 5 September 2023 | Rs

విద్యుత్ సంక్షోభానికి
రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

లోపలి పేజీలో..

స్లీప్ మోడ్‌లోకి విక్రమ్
- రెండోసారి సాఫ్ట్ ల్యాండింగ్ • ఇస్రో ప్రకటన

బెంగళూరు : చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ స్లీప్ మోడ్‌లోకి వెళ్లినట్లు భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) సోమవారం ప్రకటించింది. ఈ నెల 22న తిరిగి యాక్టివేట్ అవుతుందని భావిస్తున్నట్లు తెలిపింది. విక్రమ్ ల్యాండర్ రెండోసారి చంద్రుని ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ అయిందని పేర్కొంది. విక్రమ్ ల్యాండర్ తన లక్ష్యాన్ని సాధించిందని, "హాప్ ప్రయోగం (పైకి ఎగిరి సాఫ్ట్ ల్యాండ్ అవడం)" విజయవంతంగా పూర్తి చేసిందని వెల్లడించింది. "బెంగళూర్‌లోని కమాండ్ కంట్రోల్ నుంచి ఆదేశాలు అందుకున్న వెంటనే... ఒక్క కమాండ్‌తో విక్రమ్ ల్యాండర్ ఇంజిన్‌ను మండించింది. చంద్రుని ఉపరితలంపై నుంచి 40 సెంటీమీటర్ల మేర పైకి లేచి, 30-40 సెంటీమీటర్ల దూరంలో మరోసారి సురక్షితంగా ల్యాండ్ అయింది" అని ఇస్రో ట్వీట్ చేసింది.

నేటి నుండి

కోతలు.. టూచ్.. లేవు!

- విద్యుత్ సరఫరాపై పిల్లిమొగ్గలు • గంటల్లోనే మారిన డిస్కమ్‌ల తీరు
- అధికధరలతో కొనుగోళ్లకు నిర్ణయం • ప్రజలపై పెనుభారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం సోమవారం పిల్లిమొగ్గలు వేసింది. విద్యుత్ కొరత కారణంగా అధికారికంగానే కోతలు విధిస్తున్నట్లు తొలుత ఎపిఇఆర్‌సి నుండి ప్రకటన వెలువడింది. ఇప్పటికే అమలవుతున్న అనధికారిక కోతలతో ప్రజానీకంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటం, మరోవైపు ఎన్నికల సంవత్సరం కూడా కావడంతో ఈ ప్రకటన కలకలం రేపింది. కోతల వేటు పడిన పారిశ్రామిక వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. అధికారపార్టీలోనూ ఈ విషయం చర్చనీయాంశమైంది. సాయంత్రానికల్లా డిస్కామ్‌లు తమ వైఖరిని మార్చుకున్నాయి. కోతలు లేవంటూ ప్రకటించాయి. రాష్ట్రంలో గత రెండు రోజులుగా విద్యుత్ వినియోగం తగ్గడమే ఈ నిర్ణయానికి కారణమని తెలిపాయి. కోతలను నివారించడానికి భారీ మొత్తం వెచ్చించి ప్రైవేటు రంగం నుండి విద్యుత్ కొనుగోళ్లు చేయడానికి డిస్కమ్‌లు సిద్ధమౌతున్నాయి. రానున్నరోజుల్లో ఈ భారం ప్రజలపైనే పడనుంది.

తొలుత అలా...

రాష్ట్రంలో పరిశ్రమలకు భారీ ఎత్తున విద్యుత్ కోతలను విధించాలన్న డిస్కమ్‌ల ప్రతిపాదనలను ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన (ఎపిఇఆర్‌సి) ఆమోదించింది. ఈ మేరకు శనివారం తీసుకున్న నిర్ణయాన్ని సోమవారం ఉదయం అధికారికంగా తెలియచేశారు. మంగళవారం నుండి కోతలు అమలులోకి వస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమలకు పగటిపూట మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తారు. ఉదయం ఆరు గంటలనుండి సాయంత్రం ఆరుగంటల వరకు మాత్రమే పరిశ్రమలకు విద్యుత్ సరఫరా చేస్తామన్న డిస్కామ్‌ల ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసినట్లు ఎపిఇఆర్‌సి తెలిపింది. మొత్తం మీద పరిశ్రమలకు సరఫరాచేస్తున్న విద్యుత్‌లో 30 శాతం కోత విధిస్తున్నట్లు అదే విధంగా వారానికి ఒక రోజు పవర్ హాలిడే (24 గంటలు కరెంటు నిలిపివేత) ఇవ్వాలన్న డిస్కమ్‌ల ప్రతిపాదనలను ఆమోదించినట్లు ఎపిఇఆర్‌సి తెలిపింది.

సాయంత్రానికి ఇలా...

పరిశ్రమలకు విద్యుత్ కోతలు అమలు చేయాలన్న నిర్ణయం పారిశ్రామిక వర్గాల్లో కలకలం రేపింది. అన్ని రంగాల్లో కోతలు తప్పవన్న ఆందోళన సాధారణ ప్రజానీకంలో వ్యక్తమైంది. ఎన్నికల ఏడాదిలో ఈ తరహా నిర్ణయం మంచిది కాదన్న అభిప్రాయం అధికారపార్టీలోనూ వ్యక్తమైంది. దీంతో డిస్కమ్‌ల వైఖరి మారింది. రాష్ట్రంలో పవర్ హాలిడే అమలు చేయడం లేదని, పరిశ్రమలకు ఎటువంటి కోతలు లేవని డిస్కమ్‌లు ప్రకటించాయి. విద్యుత్ డిమాండుకు అనుగుణంగా సరఫరా మెరుగు పడిందని, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా డిమాండు తగ్గిందని తెలిపాయి.

ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమ వారం నిర్వహించిన సమావేశంలో విద్యుత్ కోతలు విధించాల్సిన అవసరం లేదని నిర్ణయించినట్లు తెలిపాయి.

అధిక ధరకు కొనుగోళ్ళు

డిస్కమ్‌లు అందచేసిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 230 మిలియన్ యూనిట్ల(ఎంయు) విద్యుత్ డిమాండు ఉంది. ప్రస్తుతం 190 మిలియన్ యూనిట్లు మాత్రమే లభ్యమవుతోంది. అంటే 40 మిలియన్ యూనిట్లకు లోటు ఉంది. రెండు రోజులుగా ఈ లెక్కలు మారాయని అధికారులు అంటున్నారు. అది నిజమేయైనా ఎక్కువ రోజులు అదే పరిస్థితి ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో యూనిట్ రూ.9.10 పైసలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. అయితే పవర్ ఎక్చేంజ్‌లోనూ లభ్యత 22 నుండి 40 శాతంలోపే ఉండటంతో మిగతా 5లో

గుంటూరు జిల్లా తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

మోడీ మళ్లీ వస్తే చీకటి రాజ్యమే

- రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు బిజెపి పల్లకి మోయడం మానుకోవాలి : వి శ్రీనివాసరావు
- రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా
- విశాఖ జిల్లాలో 35 మంది రైతులు, సిపిఎం నాయకులు అరెస్టు, విడుదల • ముగిసిన సమరభేరి

ప్రజాశక్తి- యంత్రాంగం

మోడీ మళ్లీ అధికారంలోకొస్తే దేశం చీకటి రాజ్యంగా మారనుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మోడీని గద్దె దించడానికి ఇండియా పేరుతో దేశంలోని ప్రతిపక్ష పార్టీలు ఏకమయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, ప్రశ్నిస్తానని వచ్చిన జనసేన పార్టీ... బిజెపి పల్లకి మోయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన గత నెల 30 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన సమరభేరి సోమవారం ముగిసింది. చివరి రోజు ఆయా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. కొన్ని జిల్లాల్లో కలెక్టరేట్లు, కార్పొరేషన్ కార్యాలయాలు నిరసన తెలిపారు. ధరలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ఉద్యోగాలు ఇవ్వాలని ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. విజయవాడ, అనకాపల్లితో పాటు పలు జిల్లాల్లో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. విశాఖపట్నం జిల్లా పద్మనాభం తహశీల్దార్ కార్యాలయం తలుపులు మూసేసి తహశీల్దార్‌ను కార్యాలయంలోకి వెళ్లనీయకుండా సిపిఎం ఆధ్వర్యాన రైతులు అడ్డుకున్నారు. ల్యాండ్ పూలింగ్‌కు తీసుకున్న భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని, లేకుంటే తీసుకున్న భూములకు బదులుగా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో 35 మంది రైతులను, సిపిఎం నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఆ తర్వాత విడిచిపెట్టారు.

గుంటూరు జిల్లా తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో వి.శ్రీనివాసరావు దేశంలో అధ్యక్ష తరహా పాలన తీసుకురావడానికి బిజెపి ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భిన్న జాతులు, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు కలిగిన మన దేశంలో ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. జమిలి ఎన్నికల పేరుతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఒకేసారి ఎన్నికలు జరిగి ప్రభుత్వాలు ఏర్పాటైన తరువాత అనివార్య పరిస్థితుల్లో ఒక రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి అనంతరం ఎన్నికలు జరపాల్సి వస్తే దేశమంతా మళ్లీ ఎన్నికలు జరుపుతారా? అని ప్రశ్నించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన ప్రధాన మోడీ... లక్ష ఉద్యోగాలు కూడా కల్పించలేక పోయారని దుయ్యబట్టారు. నల్లడబ్బు తీసుకొచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం మాట తప్పను మడమ తిప్పను అనే దానికి తిలోదకాలు ఇచ్చిందని విమర్శించారు. విద్యుత్ ఉద్యమం ఫలితంగా పది సంవత్సరాలపాటు విద్యుత్ ఛార్జీలు పెంచడానికి ఏ ప్రభుత్వమూ సాహసించలేదని తెలిపారు. కేంద్రంలోని మోడీ తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను మన రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అత్యుత్సాహంగా అమలు చేస్తూ గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీగా భారాలు మోపిందన్నారు. విద్యుత్ ఉద్యమాన్ని జగన్ ప్రభుత్వం ఒకసారి గుర్తు తెచ్చుకోవాలని హితవు పలికారు. తమ సమస్యలపై అర్జీలతో ప్రజలు ధర్నాకు తరలివచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.భాస్కరయ్య, జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు పాల్గొన్నారు. కర్నూలు మిగతా 2లో

దేశంలోని ఉత్తమ పద్ధతులతో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్

- స్థలాన్ని సబ్ డివిజన్ చేసిన తరువాత రిజిస్ట్రేషన్, ఆటో మ్యుటేషన్
- సిసిఎల్ఎ సాయిప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలోని ఉత్తమ పద్ధతులను పరిగణలోకి తీసుకుని, రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశామని, నూతన రిజిస్ట్రేషన్ విధానంలో పారదర్శకత, భద్రతకు పెద్దపీట వేశామని సిసిఎల్ఎ జి.సాయిప్రసాద్ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను 1999లో కంప్యూటరీకరించామని, అప్పటి అవసరాలకు 1.0 వెర్షన్ సరిపోయిందని, నేడు కొనుగోలు, అమ్మకాలు పెరిగిన నేపథ్యంలో 2.0 వెర్షన్ ప్రైమ్‌కార్డ్‌ను తీసుకొచ్చామన్నారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో సోమవారం సిఎం అడిషనల్ సెక్రటరీ ఆర్ ముత్యాలరాజు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి వి. రామకృష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. నూతన సాఫ్ట్‌వేర్ వల్ల కొనుగోలు, అమ్మకందారులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. క్రయ విక్రయాలకు కోర్టులో సాక్ష్యంగా కూడా ఈ రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 294 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. వీటితోపాటు మొదటి విడత రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సచివాలయాల్లో పనిచేసే పంచాయతీ సెక్రటరీలకు రిజిస్ట్రేషన్స్ చేసే అధికారం లభించిందని చెప్పారు. రెండో విడతలో భూముల రీ సర్వే అక్టోబరు 13కు లక్ష్యాలు పూర్తవుతాయని, ఆయా గ్రామ సచివాలయాల్లోని పంచాయతీ సెక్రటరీలకు రిజిస్ట్రేషన్లపై శిక్షణ ఇస్తున్నామని, రీ సర్వే పూర్తవగానే ఆయా పంచాయతీ సెక్రటరీలకు రిజిస్ట్రేషన్ చేసే అధికారాలు ఇస్తామని సిసిఎల్ఎ జి.సాయిప్రసాద్ తెలిపారు. గతేడాది 25లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. డాక్యుమెంట్ నచ్చిన రీతిలో రాసుకునే అవకాశం నూతన సాఫ్ట్‌వేర్‌లో కూడా ఉండడంతోపాటు లింక్ డాక్యుమెంట్లను చూసుకునే అవకాశం కూడా ఉందన్నారు. ఆస్తులకు సంబంధించిన అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని, స్టాంప్ డ్యూటీ కూడా ఆటోమేటిక్‌గా భూమికి సర్వే నెంబరు నమోదు కాగానే ఆయా ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు మిగతా 2లో

ఇళ్లు కూల్చేశారు

- పోలీసులను ఉసిగొల్పారు
- నిరసనగా ఇద్దరు మహిళల అర్ధనగ్న ప్రదర్శన

గౌహతి : పర్యావరణ పరి రక్షణ పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం దుర్మార్గంగా కూల్చేసింది. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న వారిని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఉన్న పళంగా అక్కడి నుంచి గెంటివేసింది. ఏమిటీ అన్యాయం అని అడిగినందుకు పోలీసులు వారిని చితకబాదారు. మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా కడుపుపైన, ముఖాలపైన విచక్షణా రహితంగా తన్నారు. మహిళలను మగ పోలీసులు లాక్కెళ్లి వాహనంలో కుక్కేశారు. పోలీసుల దాష్టీకంపై ఆగ్రహించిన ఇద్దరు మహిళలు అర్ధనగ్నంగా మారి అక్కడికక్కడే తమ నిరసనను తెలియజేశారు. ఇదంతా చూస్తుంటే నవలలో సన్నివేశంలా అనిపిస్తుంది. కానీ, ఇది వ్యధా భరితుల యదార్థగాథ. బిజెపి పాలిత అస్సాంలో ఈ నెల1,2 తేదీల్లో అధికారుల సాక్షిగా చోటుచేసుకున్న దారుణమిది. వివరాల్లోకి వెళితే..

గౌహతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సిల్సాకో బీల్ సరస్సు పరిసర ప్రాంతంలో సుమారు 30 ఏళ్ల నుంచి కొంత మంది నివాసం ఉంటున్నారు.

పోలీసుల దాష్టీకానికి నిరసనగా మహిళల అర్ధనగ్న ప్రదర్శన

వీరంతా వ్యవసాయం, చేపలు పట్టడం వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ నివాసం ఉంటున్నవారందరికీ పట్టాలు మంజూరు చేస్తామని ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. పర్యావరణ- చిత్తడి నేల రక్షణ పేరుతో కొత్తగా ఒక చట్టాన్ని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఆ చట్టం ఇంకా అమల్లోకి రాకముందే సిల్సాకో సరస్సు వద్ద ప్రజలను బలవంతంగా గెంటివేసే కార్యక్రమం చేపట్టింది. ఎదురుతిరిగిన వారిపైకి పోలీసులను ప్రయోగించింది.ఎలాంటి నోటీసులు ఇవ్వడం కానీ, పునరావాసం చూపడం కానీ చేయకుండా బలవంతంగా తమను ఖాళీ చేయించారని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయిదుగురు మగ పోలీసులు నన్ను పోలీస్ వ్యాన్‌లోకి లాగారు. నా భుజాలు నొప్పిగా ఉన్నాయి. మహిళా పోలీసులు ఒక్కరూ లేరు. ఇతర మహిళా నిరసనకారులపైనా వారు ఇలాగే ప్రవర్తించారు అని షరీఫా బేగం అనే మహిళ న్యూస్‌క్లిక్‌తో అన్నారు. 'మేం అక్రమ వలసదారులం కాదు. అందరికీ పట్టాలు మంజూరు చేస్తామని చెప్పిన హిమంత బిశ్వా శర్మ మాటలను నమ్మడమే మేం చేసిన పాపం' అని ఓ బాధితుడు మీడియా ముందు తన గోడు వెళ్లబోసుకున్నాడు.

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా
ఉపాధ్యాయులు, విద్యావేత్తలకు సిపిఎం అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : ప్రభుత్వ విద్యాలయాలలో పేద విద్యార్థులను నాణ్యంగా తీర్చి దిద్దేందుకు ఉపాధ్యాయ లోకం చేస్తున్న కృషిని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అభినందిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం వల్ల నేడు విద్యారంగం అస్తవ్యస్తంగా తయారైందని పేర్కొన్నారు. దీనిస్థానంలో శాస్త్రీయ విద్యా విధానం రావాలని, ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య నందించాలని కోరారు. చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వ విధానాలుండాలని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య అన్యోన్య బంధం బలపడాలని కోరుకుంటున్నానని వివరించారు. ఉపాధ్యాయులు సిపిఎస్‌కు వ్యతిరేకంగా ఒపిఎస్ పునరుద్ధరణ కోసం పోరాడుతున్నందున వారికి సిపిఎం తరుపున సంఘీభావం ప్రకటించారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగానైనా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల కోర్కెల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు.

జి20 సదస్సుకు చైనా ప్రధాని
- బీజింగ్ ప్రకటన

బీజింగ్ : జి20 సమావేశానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకావడం లేదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. "భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు న్యూఢిల్లీలో జరగనున్న 18వ జి20 సదస్సుకు స్టేట్ కౌన్సిల్ ప్రీమియర్ లీ కియాంగ్ హాజరవుతారు" అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిన్‌పింగ్ హాజరుకాక పోవడానికి గల కారణాలను వెల్లడించలేదు. ఈ వారం చివరలో ఇండోనేషియాలో జరగనున్న అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్ నేషన్స్, ఈస్ట్ ఆసియా సదస్సుకు కూడా జిన్‌పింగ్ హాజరుకావడం లేదని మీడియా తెలిపింది. ఈ సమావేశానికి కూడా లీ కియాంగ్ చైనా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు వెల్లడించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా జి20 సమావేశానికి హాజరుకాలేకపోతున్నట్లు గతవారం ప్రధాని మోడీకి ఫోన్‌లో తెలియజేసిన సంగతి తెలిసిందే. రష్యా ప్రతినిధిగా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ హాజరవుతారని తెలిపారు.

జమిలీకి గుబులే కారణమా..?

- కర్ణాటక పరాభవం పునరావృతం అవుతుందని బిజెపి భయపడుతోందా? • అవుననే అంటున్న విశ్లేషకులు

న్యూఢిల్లీ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు ఏదైనా ఒక నిర్ణయం తీసుకోవడానికి ముందు ప్రతిపక్షాలను సంప్రదించడం పరిపాటి. కానీ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో అందుకు భిన్నమైన వాతావరణం కన్పిస్తోంది. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ సందర్భంలోనూ ప్రతిపక్షాలతో చర్చించిన పాపాన పోలేదు. జమిలి ఎన్నికలపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఏ సంప్రదింపులూ లేకుండా ఏకపక్షంగా ప్రకటించిన ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో ఇండియా కూటమి తరపున ఒకే ఒక సభ్యుడు అధిర్ రంజన్ చౌదరికి అవకాశం లభించింది. అయితే ఈ కమిటీలో... తాను చేరబోనని చౌదరి స్పష్టం చేయడం ఎవరికీ ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే కమిటీ ఏర్పాటు కేవలం కంటి తుడుపు చర్య మాత్రమే. జమిలి ఎన్నికలపై ప్రభుత్వం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలో కమిటీ చేసే సిఫార్సులకు, అందులోని సభ్యుల అభిప్రాయాలకు విలువ ఏముంటుంది?

లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిపితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రయోజనాలు, లాభాల మాట అటుంచితే లోక్‌సభకు, శాసనసభలకు విడివిడిగా ఎన్నికలు జరిపితే తనకు రాజకీయంగా నష్టం కలుగుతుందేమోనని బీజేపీ అనుమానిస్తోంది. కర్నాటకలో ఎదురైన పరాభవమే ఈ సంవత్సరం చివరలో రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని శాసనసభలకు జరిగే ఎన్నికలలో కూడా పునరావృతమవుతుందేమోనని కమలనాథులు ఆందోళన చెందుతున్నారు. అందుకే ఒకే రాయి విసిరి రెండు పక్షులను నేలకూల్చాలని మోడీ నిర్ణయించారు. ఆ క్రమంలోనే శాసనసభ ఎన్నికలను నివారించి వాటిని లోక్‌సభ ఎన్నికలతో పాటే జరపాలని భావిస్తున్నారు. పైగా జీ-20 దేశాల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించబోతున్నారు. ఈ తరుణంలో అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి ఎదురైతే ప్రపంచ దేశాల ముందు తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మోడీ భయపడుతున్నారు. మరోవైపు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి రోజురోజుకూ సంఘటితమవుతోంది. విస్తృతం కూడా అవుతోంది. తాజాగా ముంబయిలో జరిగిన సమావేశాల్లో ఇది మరింత స్పష్టమైంది. ప్రజల్లో సైతం 'ఇండియా' కూటమికి మిగతా 5లో

ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షులు, మరో ఇద్దరిపై
మణిపూర్ సర్కార్ కేసులు

ఇంఫాల్ : మీడియా గొంతు నొక్కేందుకు బిజెపి నేతృత్వంలోని మణిపూర్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మణిపూర్ సిఎం ఎన్ బీరేన్‌సింగ్ ఆదేశాలతో ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షురాలు సీమా ముస్తఫా, పాత్రికేయులు సీమా గుహ, భరత్ భూషణ్, సంజయ్ కపూర్‌తో కూడిన ప్రతినిధి బృందంపై మణిపూర్ పోలీసులు ఐపిసిలోని వివిధ సెక్షన్లు, ఐటీ చట్టంలోని సెక్షన్ 66-ఎ కింద కేసులు నమోదు చేశారు. మీడియా స్వేచ్ఛ, ఎడిటోరియల్స్ నాయకత్వ ప్రమాణాలను పెంపొందించేందుకు 1978లో ఏర్పాటైన ఇజిఐ మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై ఆదివారం ఓ నివేదికను విడుదల చేసింది. బీరేన్‌సింగ్ ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తోందని, ఇంఫాల్‌లో మీడియా మొత్తం మెయితీలకు అనుకూలంగా మారిందని పేర్కొంది. ఈ నివేదిక మరిన్ని హింసాత్మక పరిస్థితులకు దారితీసేలా ఉందని, ఇజిఐపై కేసు నమోదు చేయాలని బీరేన్ సింగ్ పోలీసులను ఆదేశించారు. ఐటి చట్టంలోని 66ఎను 2015లోనే సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సెక్షన్ కింద పౌరులను హింసించడాన్ని నిలిపివేయాలని అన్ని రాష్ట్రాల పోలీసులను ఆదేశించినా, మణిపూర్ పోలీసులు అదే సెక్షన్ కింద కేసు నమోదు చేయడం గమనార్హం.

బస్సు అద్దాలను ధ్వంసం చేస్తున్న ఏనుగు

మన్యంలో ఏనుగు బీభత్సం

ప్రజాశక్తి- కొమరాడ (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లాలో ఓ ఏనుగు అంతర రాష్ట్ర రహదారిపై సోమవారం బీభత్సం సృష్టించింది. అర్తాం గ్రామ సచివాలయం సమీపంలో రహదారిపైకి వచ్చి సుమారు గంట పాటు హల్‌చల్ చేసింది. దీంతో, ఒడిశా నుంచి ఆంధ్రాలోకి, ఆంధ్రా నుంచి ఒడిశాకు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. రోడ్డు పక్కనే ఉన్న బార్బర్ దుకాణాన్ని పూర్తిగా ధ్వంసం చేసింది. అనంతరం రహదారిపై నిలుపుదల చేసిన ప్రయివేటు బస్సుపై దాడి చేసి, బస్సు ముందుభాగంలో అద్దాలను పగులగొట్టింది. ఆ సమయంలో బస్సును వెనక్కి మళ్లించేందుకు డ్రైవర్ ప్రయత్నించినా సెల్ఫ్ స్టార్ట్ కాకపోవడంతో కదలలేదు. బస్సు డ్రైవర్, ప్రయాణికులు సైతం వెనక్కి వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎలిఫెంట్ ట్రాకర్లు కేకలు వేయడంతో ఏనుగు అక్కడి నుంచి రహదారిపైకి వచ్చి అటు ఇటు తిరుగుతూ మనుషులను వెంబడించి దాడి చేసేందుకు ప్రయత్నం చేసింది. అటవీశాఖ అధికారులు, పోలీసులు సమయానికి రాకపోవడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. అనంతరం సమీపంలో ఉన్న పంట పొలాల్లోకి ఏనుగు వెళ్లిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఎనిమిదేళ్లుగా జిల్లాలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు నుంచి ఏనుగు గత కొద్దిరోజుల క్రితం విడిపోయిన ఏనుగు ఈ దాడికి పాల్పడినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. గతంలోనూ గుంపు నుంచి విడిపోయిన ఏనుగులు అనేకసార్లు పశువులపైనా, మనుషులపైనా దాడి చేసి చంపేసిన సంఘటనలు ఉన్నాయి. తక్షణమే అధికారులు ప్రభుత్వం స్పందించి ఏనుగుల గుంపును శాశ్వతంగా అటవీ ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరారు.

పాలిసెట్ తుది దశ అడ్మిషన్లలో 2,174 మంది విద్యార్థులకు ప్రవేశాలు

- చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాలిసెట్ తుది దశ అడ్మిషన్ల ప్రక్రియలో 2,174 మంది విద్యార్థులకు నూతనంగా ప్రవేశాలు కల్పించినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనరు చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. మొత్తంగా 267 కళాశాలల్లో 41.4శాతం మేర 34,050 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 68 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 54.2శాతం మేర 9835 సీట్లు భర్తీ అయ్యాయన్నారు.

179 ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 39.8 శాతంగా 24,215 సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేశామన్నారు. సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి అయినందున ఈ నెల 7వ తేదీలోపు నాలుగు రోజుల వ్యవధిలో విద్యార్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. క్లాసులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, ఈనేపథ్యంలో విద్యార్థులు వేగంగా ప్రవేశాలు పొందాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనరు చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రా యాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సనాతన ధర్మాన్ని దోమల నిర్మూలనతో పోల్చడం తగదు

- పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమిళనాడు మంత్రి ఉదయ్‌నిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని దోమల నివారణ చర్యతో పోల్చి నిర్మూలించాలని పేర్కొనడం తగదని, ఈ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయ్‌నిధి స్టాలిన్‌ను సమర్ధిస్తూ కార్తీక్ చిదంబరం చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మనోభావాలను దెబ్బతీసే విధంగా ఇండియా కూటమిలోని నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు.

ఉప్పొంగిన వాగులు

- పలు జిల్లాల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు
- కాకినాడలో పిడుగుపాటుకు మహిళ మృతి
- నేడు కోస్తాంధ్రలో భారీ వర్షాలు

అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళా ఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు పడ్డాయి. ప్రకాశం జిల్లాల్లో కురిసిన వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కంభం మండలానికి చెందిన ఓ కూరగాయాల వ్యాపారి వాగులో కొట్టుకుపోయారు. కాకినాడలో పిడుగుపాటుకు ఓ వ్యవసాయ మహిళా కూలీ మరణించారు. నంద్యాల జిల్లాలో గోంద్ర వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి.

కోస్తాంధ్రలో మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అనంతపురం, సత్యసాయి జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వానపడింది. అనంతపురం జిల్లాలో 31 మండలాలకు గాను 30 మండలాల్లో వర్షపాతం నమోదైంది. 21 మండలాల్లో 20 మిల్లీమీటర్ల కంటే అధికంగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పెద్దవడుగూరులో అత్యధికంగా 59.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సత్యసాయి జిల్లాలోని 32 మండలాలకు గానూ 14 మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా నల్లచెరువు మండలంలో 33.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. నంద్యాల, కర్నూలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎడతెరపి లేని వర్షం కురిసింది. నంద్యాల జిల్లా సంజామల మండలం సంజామల-కానాల గ్రామాల మధ్య గోంద్ర వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు, కొత్తపల్లి, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో మోస్తరు వర్షం కురిసింది.

ప్రకాశం జిల్లాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు రాచర్ల మండలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి షేక్ మహమ్మద్ ఖాసింవలీ(42) సోమవారం ద్విచక్రవాహనంపై కూరగాయలు అమ్ముకుంటూ అక్కపల్లె గ్రామం నుండి చోళవీడు గ్రామానికి బయలుదేరాడు. రెండు గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న లోతోగు వాగును దాటేందుకు యత్నించారు. ద్విచక్రవాహనంతో సహా ఖాసింవలీ కొట్టుకుపోయాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ, అనంతగిరి, పాడేరు మండలాల్లో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది.

పిడుగు పడి మహిళ మృతి

కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన గంపా సత్యవతి (26) గ్రామ శివారున వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఆమెకు సమీపంలో పిడుగుపడడంతో మరణించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి నేరాలపై ఆధారాలున్నాయి

- సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉంది
- ఆ ఇద్దరి బెయిల్ పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిల బెయిల్ పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో కుట్ర, సాక్ష్యాల చెరిపివేతలో ఇద్దరి ప్రమేయానికి సంబంధించి నమ్మదగిన ఆధారాలున్నాయని న్యాయస్థానం పేర్కొంది. కేసు డైరీ, ఇతర అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత బెయిల్ పిటిషన్లను తిరస్కరిస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. భాస్కర్‌రెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డిలపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నట్లు ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డిలకు సిబిఐ కోర్టు బెయిలును తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 24న వాదనలు ముగిసిన ఈ కేసులో జస్టిస్ కె లక్ష్మణ్ తీర్పును రిజర్వు చేసి సోమవారం ప్రకటించారు.

నిందితులు అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శివశంకర్ రెడ్డిలకు ఉదయ్ ముఖ్య అనుచరుడు. భాస్కర్, ఉదయ్ నేరాలపై నమ్మదగిన ఆధారాలున్నాయి. కుట్ర, సాక్ష్యాల చెరిపివేతలో వారిద్దరి ప్రమేయంపై ఆధారాలున్నట్లు కనిపిస్తోంది. వీళ్లిద్దరూ అత్యంత ప్రభావశీల వ్యక్తులు. సాక్షులంతా ఎపికి చెందినవారే. అందువల్ల వారిని బెదిరించి ప్రభావితం చేసే అవకాశాలున్నాయి. గతంలో సిఐ శంకరయ్య, గంగిరెడ్డి వాంగ్మూలమిస్తామని వెనక్కి తగ్గారు. కేసు విచారణ సమయంలోనే ఇద్దరు సాక్షులు అనుమానాస్పద స్థితిలో మరణించారు. దస్తగిరి, సాక్షుల వాంగ్మూలాల విశ్వసనీయతను ట్రయల్ కోర్టే పరిశీలిస్తుంది. బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకోలేం. అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ సుప్రీం కోర్టు పరిశీలనలో ఉంది. దస్తగిరి మినహా నిందితులందరూ జ్యుడీషియల్ కస్టడీలోనే ఉన్నారు. కేసు డైరీ, అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం పిటిషన్లను కొట్టివేస్తున్నామని జస్టిస్ కె లక్ష్మణ్ ప్రకటించారు.

ఇదే కేసులో మరో నిందితుడు డి శివశంకర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై సిబిఐ కోర్టు సోమవారం విచారణ చేపట్టింది. దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై గత నెల 24న వాదనలు ముగిశాయి. ఆయన బెయిల్ పిటిషన్‌పై గత 28న ఉత్తర్వులు ఇస్తామని సిబిఐ కోర్టు తెలిపింది. బెయిల్‌పై మరిన్ని వాదనలు వినాలని కోరుతూ ఆగస్టు 28న శివశంకర్ రెడ్డి మరో పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఫెడరేషన్ ఆధ్వర్యాన వడ్డేశ్వరంలోని మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించారు. జాయింట్ డైరెక్టర్ పూర్ణ చంద్రరావుకు వినతిపత్రం ఇచ్చారు. దీనికి స్పందించిన ఆయన దీనిపై ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ రంగంలో వేర్వేరు సెక్షన్లలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సునీల్‌కుమార్, డి.రామాంజనేయులు, పి.వేణుగోపాల్, లంక దాసు, పి.శ్రీనివాసరావు, నాగరాజు, రమణ, మల్లికార్జున్, ఓటులేసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని గాంధీనగర్ తహశీల్దార్ కార్యాలయం వద్ద వినూత్న రీతిలో నిరసన

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

మోడీ మళ్లీ వస్తే చీకటి రాజ్యమే

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచారని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టుకోవడానికి జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేయకపోవడం శోచనీయమన్నారు. దీనిని బట్టి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పట్ల ఆయనకు శ్రద్ధ ఏపాటిదో అర్థమవుతోందని పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని గాంధీనగర్ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైన కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపాల్సి వస్తుందని హెచ్చరించారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలను ప్రజలపై భారాలు మోపిందని, అదాని, అంబానీ లాంటి కార్పొరేట్లకు రాయితీల రూపంలో దేశ సంపదను కట్టబెట్టిందని విమర్శించారు. బాపట్ల జిల్లా కొల్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు ధర రూ.200 చేరుకుందని, దీంతో, కొనుగోలు చేయలేని స్థితిలో పేదలు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చౌకదుకాణాల ద్వారా గత రెండు నెలల నుంచి కందిపప్పు అందించకపోవడం శోచనీయమన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం తహశీల్దార్ ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ మాట్లాడుతూ విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణ లోపం కారణంగా హంద్రీనీవా కాలువ ద్వారా నీరు సక్రమంగా అందడం లేదన్నారు. 12 రోజుల్లో మూడుసార్లు ఈ కాలువకు గండ్లు పడడాన్నిబట్టి కాలువల నిర్వహణ ఏ విధంగా ఉందో అర్థమవుతోందన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ ధరలు పెంచడంలో పోటీపడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యాయని విమర్శించారు. నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నాయని విమర్శించారు. అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని పివిటిజిలకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో జరిగిన ధర్నాలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము పాల్గొని మద్దతు తెలిపారు. నంద్యాల, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్ఆర్, ప్రకాశం, పల్నాడు, కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ధర్నాలు జరిగాయి.

అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద వినూత్న రీతిలో నిరసన

నెల్లూరులో ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న సిపిఎం శ్రేణులు

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తే.. బిజెపికి ఇవే చివరి ఎన్నికలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేసుకుంటూ పోతే మోడీ నేతృత్వంలోని బిజెపికి ఇవే చివరి ఎన్నికలు కాగలవని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 935వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మేధావుల మౌనం దేశ ప్రగతికి నష్టం చేకూరుస్తుందన్నారు. మోడీ అనుసరిస్తోన్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి మరలా గద్దెనెక్కేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో పేదరికం విపరీతంగా పెరిగిందని, మరలా మోడీనే అధికారంలోకి వస్తే దేశం అధోగతి పాలవుతుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ద్వారా కోట్లాది మంది కార్మికులు, ప్రజలు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం విరమించుకునేంత వరకూ ఉక్కు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

కౌలు చెల్లించారో లేదో చెప్పండి..

- రాజధాని రైతుల కౌలు కేసులో సిఆర్‌డిఎకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతి నిర్మాణం నిమిత్తం భూములు ఇచ్చిన రైతులకు చట్టబద్ధంగా కౌలు నగదు చెల్లింపుల వ్యవహారంపై తీసుకున్న చర్యలు నివేదించాలని సిఆర్‌డిఎను హైకోర్టు సోమవారం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ వి. సుజాతతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. రాజధానికి భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు చెల్లించేలా సిఆర్‌డిఎ ఉత్తర్వులు ఇవ్వాలంటూ అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య జాయింట్ సెక్రెటరీ కల్లం రాజశేఖర్‌రెడ్డి, రాజధాని రైతు పరిరక్షణ సమితి జాయింట్ సెక్రెటరీ ధనేకుల రామారావు వేర్వేరుగా వేసిన వ్యాజ్యాలపై విచారణను ఈ నెల 12కి వాయిదా వేసింది. కౌలు చెల్లింపు జాప్యం చేసినందున 24 శాతం వడ్డీతో చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ల వాదన. ఆలస్యానికి బాధ్యులైన అధికారుల నుంచి పిటిషనర్ల సొసైటీల సభ్యులకు పరిహారం ఇచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి సిఆర్‌డిఎకు నోటీసులు ఇచ్చారు. ఏవిధమైన ఉత్తర్వులు జారీ చేయలేదంటూ రైతులు అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశారు. సింగిల్ జడ్జి నోటీసులు జారీ దశపై అప్పీల్ వేయడాన్ని డివిజన్ బెంచ్ ఆక్షేపించింది. దీనిపై పిటిషనర్ లాయర్ ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ, నోటీసు దశలోనే అప్పీల్ దాఖలుకు వీలుందని నిబంధనలను గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను వివరించారు. నోటీసు దశలో అప్పీళ్లను అనుమతిస్తే ఇలాంటి కేసులు కోకొల్లలుగా దాఖలౌతాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఏటా మే1లోగా వార్షిక కౌలు చెల్లించాలన్న నిబంధనలను సిఆర్‌డిఎ అమలు చేయలేదని న్యాయవాది చెప్పారు. సెప్టెంబర్ వచ్చినా ఇవ్వలేదన్నారు. రైతుల ఇబ్బందుల్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దీనిపై సిఆర్‌డిఎ తరపు గవర్నమెంట్ స్పెషల్ ప్లీడర్ కాసా జగన్‌మోహన్‌రెడ్డి స్పందిస్తూ, అప్పీల్ చెల్లదన్నారు. పిటిషన్‌పై సింగిల్ జడ్జి తుది నిర్ణయం తీసుకోకుండా అప్పీల్ దాఖలు చేయడం అన్యాయమన్నారు. చట్ట వ్యతిరేకంగా అప్పీలు దాఖలు చేయడాన్ని ఆమోదించరాదని చెప్పారు. కౌలు నగదుకు, పిటిషనర్ల సొసైటీలకు సంబంధం లేదన్నారు. వాదనల సమయంలో బెంచ్ కల్పించుకుని, చట్టబద్ధంగా రైతులకు కౌలు చెల్లించారో లేదో చెప్పాలని ప్రశ్నించింది. దీనిపై వివరాలు ఇచ్చేందుకు సమయం కావాలని రెడ్డి కోరడంతో విచారణ ఈ నెల 12కి వాయిదా వేసింది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) డిమాండ్
- ఐసిడిఎస్ డైరెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐసిడిఎస్ డైరెక్టర్‌కు ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ సోమవారం ప్రకటనను మీడియాకు విడుదల చేశారు. తెలంగాణా కన్నా అదనంగా అంగన్‌వాడీల వేతనం పెంచాలని కోరారు. అంగన్‌వాడీలకు తెలంగాణా రాష్ట్రంలో ఇచ్చిన దానికన్నా అదనంగా వేతనం ఇస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని, వెంటనే ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. తెలంగాణాలో 2021 జులై నుంచి వర్కర్లకు రూ.13,500, హెల్పర్లు, మినీవర్కర్లకు రూ.7,800 ఇస్తున్నారని తెలిపారు. ఎపిలో పెరగలేదని వివరించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రిటైర్మెంట్ వయసు రూ.65 ఏళ్లకు పెంచిందని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ అంగన్‌వాడీ వర్కర్లు హెల్పర్లు, మినీ వర్కర్లకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న డిఎ బిల్లులు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారింట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రమోషన్లలో రాజకీయం జోక్యం తగ్గించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె, ఎంఆర్‌ఒ, ఎండిఒ, రాజకీయ నాయకులు అవమానిస్తున్నారని, వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాజెక్టులో హనుమాయమ్మను రాజకీయ కక్షతో నిర్ధాక్షిణ్యంగా చంపారని, కనీసం మట్టి ఖర్చులు కూడా ఇచ్చే దిక్కులేదని పేర్కొన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలని, ప్రీస్కూల్ విద్యార్థులకు యూనిఫాం సరఫరా చేయాలని కోరారు.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- 7న మహిళా విభాగం కార్యవర్గ ప్రమాణస్వీకారం : బొప్పరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ వారికి రావాల్సిన న్యాయమైన హక్కుల సాధనలో వారికి తాము అండగా నిలుస్తామని ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం మహిళా విభాగం ప్రతినిధులు, జెఎసిలోని భాగస్వామ్యపక్షాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పరాజు, పలిశెట్టి దామోదర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మహిళా విభాగం ప్రమాణా స్వీకారోత్సవ కార్యక్రమం విజయవాడ బందరు రోడ్డులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగ సంఘ నాయకులు పారె లక్ష్మి, పొన్నూరు విజయలక్ష్మి, జి.పావని, సైకం శివకుమారిరెడ్డి, ఎపి జెఎసి అమరావతి సహ ఛైర్మన్ టివి ఫణిపేర్రాజు, దొప్పలపూడి ఈశ్వర్, బి.కిషోర్ పాల్గొన్నారు.

దేశంలోని ఉత్తమ పద్ధతులతో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్

(మొదటిపేజీ తరువాయి)

చేసిన మార్కెట్ ధర డిస్‌ప్లే అవుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్‌తోపాటు ఆటోమ్యుటేషన్ కూడా జరుగుతుందని, స్థలాన్ని సబ్ డివిజన్‌గా మార్చిన తర్వాత మాత్రమే రిజిస్ట్రేషన్ జరుగుతుందని సిసిఎల్ఎ వెల్లడించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇసి, రెవెన్యూ రికార్డు ఇవ్వడం జరుగుతుందని, సబ్ రిజిస్ట్రార్ వద్ద స్కాన్ చేసిన డాక్యుమెంట్ మాత్రమే ఉంటుందని తెలిపారు. ఐటి యాక్ట్ 2000 ప్రకారం ఎలక్ట్రానిక్ సిగ్నేచర్ చేసిన డాక్యుమెంట్స్ చెల్లుతాయని తెలిపిందని సిసిఎల్ఎ పేర్కొన్నారు. నూతన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన లేని వారు మాత్రమే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అవి జెరాక్స్ కాపీలంటూ కొందరు చేస్తున్న ప్రచారాన్ని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజి వి.రామకృష్ణ ఖండించారు. కొత్త సాఫ్ట్ వేర్ వల్ల కొనుగోలు, అమ్మకందారులకు ఎంతో లాభం చేకూరుతుందని తెలిపారు.

క్రూయిజ్ టూరిజానికి గమ్యస్థానంగా విశాఖ

- కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్
- రూ.333.56 కోట్ల విలువైన నాలుగు ప్రాజెక్టులు ప్రారంభం

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వైజాగ్ ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ విశాఖపట్నాన్ని దేశంలో క్రూయిజ్ టూరిజానికి గమ్యస్థానంగా నిలుపనుందని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు. సాగరమాల కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం పోర్ట్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.333.56 కోట్లతో నిర్మించిన అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌తోపాటు మూడు ప్రాజెక్టులను సోమవారం ఆయన విశాఖలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ పోర్టు రాకతో విశాఖ నగరం ఎలా అభివృద్ధి అయ్యిందో వివరించారు. తొలుత ఆయన రూ.33.80 కోట్లతో పోర్టు ఆర్-11 ప్రాంతంలో నిర్మించిన స్టోరేజ్ షెడ్డును ప్రారంభించారు. ఈ షెడ్డు 84 వేల టన్నుల బల్క్ బ్యాగ్ కార్గోలను నిల్వ చేయగల సామర్థ్యం కలిగి ఉందన్నారు. అనంతరం ఆర్-1, ఒఆర్-2, ఒఆర్-3 పునరుద్ధరణలో భాగంగా 14.5 మీటర్ల డ్రాఫ్ట్ వెసెల్స్, 85 వేల వెసెల్స్ నిర్వహణకు రూ.167.66 కోట్లతో నిర్మించిన ఒఆర్-1 బెర్తును ప్రారంభించారు. ఈ బెర్త్ 243 మీటర్ల సామర్థ్యంతో, 3.81 ఎంఎంటితో వచ్చే ఏడాది అక్టోబర్ 31కి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. రూ.36.5 కోట్లతో 20 ఎకరాల్లో తలపెట్టిన ప్రపంచ స్థాయి ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌ను ప్రారంభించారు. ఈ ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌లో 666 వాహనాలను నిలిపి ఉంచవచ్చని తెలిపారు. వంద పడకల విశ్రాంతి గృహం, ఒక ఎటిఎం, తొమ్మిది షాపులు ఇక్కడ నిర్మిస్తామన్నారు. పెట్రోల్ బంక్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రూ.96.5 కోట్ల పెట్టుబడితో నిర్మించిన విశాఖపట్నం ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్‌ను ప్రారంభించారు. దీంతో, 2000 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన క్రూయిజ్ షిప్‌ల నిర్వహణ సులభతరమవుతుందన్నారు. ఈ క్రూయిజ్ లైనర్ నిర్మాణంతో విశాఖపట్నం పోర్ట్ అథారిటీకి చెన్నయ్, కొలంబో, సింగపూర్, బంగ్లాదేశ్‌లకు సేవలు అందించే అవకాశం ఉందని తెలిపారు. విశాఖ పర్యాటకులకు ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. ఇక్కడి తీరాలు, చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు ఇట్టే ఆకట్టుకుంటాయన్నారు. విశాఖపట్నం పోర్టు, వైజాగ్ ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ ప్రగతి పథంలో నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్, విశాఖ, అనకాపల్లి ఎంపిలు ఎంవివి.సత్యనారాయణ, బివి.సత్యవతి, రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ అంగముత్తు, ఎమ్మెల్యేలు గణబాబు, తిప్పల నాగిరెడ్డి, విశాఖ మేయర్ హరి వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు.

సౌది నుంచి రెట్టింపు చమురు దిగుమతి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది ఆగస్టులో రష్యా నుంచి ముడి చమురు దిగుమతి భారీగా తగ్గగా.. మరోవైపు సౌదీ అరేబియా నుంచి దాదాపు రెట్టింపు ముడి చమురు దిగుమతి పెరిగిందని ప్రభుత్వ గణంకాలు తెలిపాయి. రష్యా నుంచి వరుసగా మూడో నెలలో చమురు దిగుమతులు తగ్గి.. ఏడు నెలల కనిష్ట స్థాయికి పడిపోయాయి. ఆగస్టులో ప్రతి రోజూ 1.46 మిలియన్ బ్యారెల్ల క్రూడాయిల్ దిగుమతి చేసుకున్న భారత్.. జూలైలో 1.91 మిలియన్ బ్యారెళ్ల దిగుమతి చేసుకుది. ఇరాక్ నుంచి జూలైలో 8.91 లక్షల బ్యారెళ్ల ముడి చమురు దిగిమతైతే.. ఆగస్టులో 8.66 లక్షల బ్యారెళ్లకు పడిపోయింది. కానీ సౌదీ అరేబియా నుంచి ప్రతి రోజూ 4.84 లక్షల బ్యారెళ్ల నుంచి 8.20 లక్షల బ్యారెళ్ల క్రూడ్ దిగుమతి పెరగడం విశేషం.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-టెండర్ నోటీసు ఆహ్వానం (http://ireps.gov.in ద్వారా) PUB/1005

భారత రాష్ట్రపతి మరియు సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ తరపున టెండరింగ్ యొక్క సింగిల్ ప్యాకిట్ సిస్టమ్‌లో క్రింది విధమైన పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

క్ర.సం.: 01. నిట్ నం.: సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/21/2023-24, పని పేరు : టెండర్ నం.సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/21/2023-24, తేది : 01.09.2023: ఎస్సీ డివిజన్‌లోని జగ్గయ్యపేట టౌన్ స్టేషన్‌లో స్విచింగ్ స్టేషన్‌ను పెంచడం, వివరాలు అంచనా విలువ : రూ.1,60,31,372.57/-, పూర్తి వ్యవధి : 180 రోజులు, ముగింపు తేది : 27.09.2023, 15.00 గం.

1. బిడ్ డాక్యుమెంట్లు మరియు ఇతర వివరాల కొరకు http://ireps.gov.in లాగిన్ అవ్వండి.
2. టెండరర్లు ఇ-టెంటరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనాలి మరియు మాన్యువల్ ఆఫర్లు ఏవీ పరిగణించబడవు.
3. భావి టెండరర్లందరూ ఆన్‌లైన్ చెల్లింపులు/బిజి ద్వారా మాత్రమే ఇఎమ్‌డి చెల్లించాలని అభ్యర్థించడమైనది.
4. భావి టెండరర్లందరూ జిఎస్‌టిఐఎన్ గుర్తింపు నం.లు. పొందాలని మరియు వారి ఆఫర్‌తో పాటు సమర్పించాలని సూచించబడ్డారు.
5. ఏదైనా సవరణ కొరకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) టెండర్ సమర్పణ కాలం ప్రారంభం వరకు టెండరర్లు చూసుకోవాలి.

సీనియర్, డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/టిఆర్‌డి/సికింద్రాబాద్

తేది : 01.09.2023, టెండర్ నోటీసు ఆహ్వానం ఇ టెండర్ నం.బి/ఎస్‌జి/సిఎన్/ఎస్ అండ్ టి/బిజెడ్ఎ/5/2023-24 PUB/1008
(ireps.gov.in ద్వారా)

భారత రాష్ట్రపతి మరియు సిగ్నల్ అండ్ టెలికాం (కన్‌స్ట్రక్షన్), సౌత్ సెంట్రల్ రైల్వే, విజయవాడ తరపున టెండరింగ్ యొక్క ఓపెన్ టెండర్/సింగిల్ ప్యాకెట్ సిస్టమ్ క్రింద దిగువ పనుల కొరకు ఇ టెండర్లను ఆహ్వానించడమైనది.

క్ర.సం.1, టెండర్ నోటీసు నం.: బి/ఎస్‌జి/సిఎన్/బిజెడ్ఎ/5/2023-24, తేది : 01.09.2023, పని పేరు : జిఎన్‌టి-జిటిఎల్ విభాగం మధ్య రెట్టింపు పనులకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వేలోని జిఎన్‌టి డివిజన్ యొక్క డబుల్ లైన్ పనిని అమలు చేయడానికి ఎస్ అండ్ టి యుటిలిటీలను మార్చడం మరియు సిగ్నలింగ్ మరియు టెలికాం కేబుల్‌ల మళ్లింపు, టెండర్ విలువ : రూ.3,09,15,736.03/-, బిడ్ సెక్యూరిటీ : రూ.3,04,600/-, పూర్తి వ్యవధి : 18 నెలలు, ముగింపు తేది మరియు సమయం : 27.09.2023, 15.00 గం.

1) బిడ్ డాక్యుమెంట్లు మరియు ఇతర వివరాల కొరకు https://ireps.gov.in లాగిన్ అవ్వండి.
2) టెండర్లు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో టెండర్ సమర్పణ/బిడ్డింగ్ వ్యవధి కాలం ముగింపుకు పదిహేను రోజుల ముందు సమర్పించాలి.
3) ఏదైనా సవరణ కొరకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) టెండర్ సమర్పణ కాలం ప్రారంభం వరకు టెండరర్లు చూసుకోవాలి.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) విజయవాడ

తేది : 02.09.2023, ఇ టెండర్ నోటీసు నం.జిఎన్‌టి/ఎస్‌జి/జిఎస్‌యు/283 PUB/1009

ఇ టెండర్ నోటీసు నం.జిఎన్‌టి/ఎస్‌జి/జిఎస్‌యు/283, తేది : 02.09.2023 (సిపిఎమ్/జిఎస్‌యు/జిఎన్‌టి తరపున) 25.09.2023, 12.00గం. వరకు క్రింది పనుల కొరకు దిగువసంతకందారు ఇ టెండర్లను ఆహ్వానించడమైనది.

ఐడి నం.: 283, పని పేరు : గుంటూరు డివిజన్‌లోని గుంటూరు యార్డులో మల్టీ-ట్రాకింగ్ మరియు కనెక్టివిటీకి సంబంధించి గుంటూరులోని డిఆర్‌ఎమ్ కార్యాలయంలో టెలికాం టెస్ట్ రూమ్‌ను డేటా లాగర్ అప్‌గ్రేడ్ చేయడం. సుమారు ఖర్చు (రూ.) : 1,95,14,680.50/-, ఇ.ఎమ్.డి/బిడ్ సెక్యూరిటీ (రూ.) : 2,47,600/-, టెండర్ డాక్యుమెంట్ ఖరీదు (రూ.) : 0/-

1. ఇ బిడ్స్ ఆన్‌లైన్ సమర్పణ కొరకు చివరి తేది : 25.09.2023, 12.00 గం. వరకు. వివరణాత్మక సమాచారం కొరకు మా వెబ్‌సైట్ ను లాగిన్ అవ్వండి.
2. తదుపరి కమ్యూనికేషన్/సవరణ ఏదైనా ఇ పోర్టల్ ద్వారా మాత్రమే తెలియజేయబడుతుంది.

సీనియర్.డివిజినల్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్, గుంటూరు

తేది : 04.09.2023, టెండర్ నం.జిటిఎల్-ఇఎమ్-11-2023-24 PUB/1010

భారత రాష్ట్రపతి మరియు సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/మెంటినెన్స్/గుంతకల్లు తరపున క్రింది విధమైన పనుల కొరకు తాత్కాలిక బాధ్యతలు నిర్వహించేందుకు ఇ టెండర్లను ఆహ్వానించడమైనది.

టెండర్ నం.: జిటిఎల్-ఇఎమ్-11-2023-24, గుంతకల్లు డివిజన్ : గుంతకల్లు డిఆర్‌ఎమ్ కార్యాలయంలో 11 టాన్ ఎసిల మూడు యూనిట్ల భర్తీ. సుమారు విలువ : **రూ.24,40,857/-**

ముగింపు తేది మరియు సమయం : 27.09.2023, 15.00 గం.

టెండర్ మరియు ఇతర వివరాల కోసం బిడ్డింగ్ కోసం http://www.ireps.gov.in కు లాగిన్ చేయండి. టెండర్ యొక్క కొరిజెండమ్, ఏదైనా ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండర్ డాక్యుమెంట్‌ను టెండరర్లు ఉచితంగా http://www.ireps.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

గమనిక : ఈ ఇ-టెండర్‌లో పాల్గొనడానికి/బిడ్ చేయడానికి, టెండరర్ చెల్లుబాటు అయ్యే డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్) కలిగి ఉండాలి.

సీనియర్. డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, మెయింటినెన్స్, గుంతకల్లు

భారత్‌లో జీవవైవిద్యానికి అమెజాన్ రూ.24 కోట్ల వ్యయం

న్యూఢిల్లీ : భారత్‌లో ప్రకృతి ఆధారిత ప్రాజెక్టుల్లో ప్రాథమికంగా మూడు మిలియన్ డాలర్ల (దాదాపు రూ.24 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ వెల్లడించింది. ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో ప్రకృతి ఆధారిత ప్రాజెక్టులకు కేటాయించిన 15 మిలియన్ డాలర్ల నుంచి వీటిని వ్యయం చేయనున్నట్లు పేర్కొంది. తొలుత పశ్చిమ కనుమల్లోని జీవ వైవిధ్య సంరక్షణకు గాను సెంటర్ ఫర్ వైల్డ్‌లైఫ్ స్టడీస్‌తో కలిసి పని చేయనున్నట్లు వెల్లడించింది. ఆసియా పులులు, ఏనుగులు అత్యధికంగా ఈ ప్రాంతంలోనే ఉన్నాయని పేర్కొంది. అదే విధంగా పళ్లు, కలపతో పాటు ఔషధ గుణాలున్న చెట్లను నాటి, సంరక్షించేలా రైతులకు సాయం అందించనున్నట్లు తెలిపింది.

తేది : 04.09.2023, టెండర్ నం.జిటిఎల్-ఇఎమ్-13-2023-24 PUB/1011

భారత రాష్ట్రపతి మరియు సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/మెయింటినెన్స్/గుంతకల్లు తరపున క్రింది విధమైన పనుల కొరకు తాత్కాలిక బాధ్యతలు నిర్వహించేందుకు ఇ టెండర్లను ఆహ్వానించడమైనది.

టెండర్ నం.: జిటిఎల్-ఇఎమ్-13-2023-24, గుంతకల్లు డివిజన్ : (ఎన్‌సిహెచ్-ఎ)- యర్రగుంట్ల-ఎలెక్ట్రికల్‌లో రన్నింగ్ రూమ్ మరియు కంబైన్డ్ (క్రూ బుకింగ్ లాబీని పెంచడం (ఎన్‌సిహెచ్-బి) - వెంకటగిరి, కోడూరు, ఓబులవారిపల్లి, కృష్ణాపురం మరియు ముద్దనూరులో ప్లాట్‌ఫామ్‌పై బస్ తరహా షెల్టర్‌లను (ఒక్కొక్కటి 24మీ) ఏర్పాటు చేయడానికి విద్యుత్ ఏర్పాట్లు. (ఎస్‌సిహెచ్-సి) రేణిగుంట (ఆర్‌యు) వద్ద పిట్ లైటింగ్ ఏర్పాటుకు విద్యుత్ ఏర్పాట్లు. సుమారు విలు వ: రూ.53,82,603.63/-

ముగింపు తేది మరియు సమయం : 27.09.2023, 15.00 గం.

టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు లాన్ అవ్వండి టెండర్ సవరణ ఏదైనా ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండర్ డాక్యుమెంట్లను టెండర్‌దారులు http://www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు.

గమనిక : ఈ ఇ-టెండర్‌లో పాల్గొనడానికి/బిడ్ చేయడానికి, టెండరర్ చెల్లుబాటు అయ్యే డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్) కలిగి ఉండాలి.

సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్లు.

టెండర్ నోటీసు నం.: సిఆర్‌ఎస్-ఇ. 04-23-24 PUB/1012

భారత రాష్ట్రపతి మరియు ఎడిఇ/సిఆర్‌ఎస్/టిపిటివై తరపున ఈ-టెండర్‌లను టెండర్ నంబర్‌కు వ్యతిరేకంగా ఆహ్వానిస్తారు: (క్రింద పేర్కొన్న ముగింపు తేదీ క్రింద 15:00 గంటల వరకు పేర్కొనబడింది. బిడ్డర్లు తమ ఒరిజినల్/రివైజ్డ్ బిడ్‌లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్‌లు అనుమతించబడవు మరియు అటువంటి మాన్యువల్ ఆఫర్‌ను స్వీకరించినట్లయితే విస్మరించబడుతుంది.

(క్ర.సం. :1, పని వివరణ : టెండర్ నం. : సిఆర్‌ఎస్-ఇ-04-23-24, తిరుపతిలోని క్యారేజ్ రిపేర్ షాప్‌లో ఐసిఎఫ్‌ని ఎన్‌ఎమ్‌జిహెచ్‌ఎస్ కోచ్‌లుగా మార్చడానికి సిబిఆర్ వద్ద కొత్త షెడ్ ఏర్పాటు కోసం ఎల్కెట్రికల్ పనులను అమలు చేయడం, సుమారు విలువ (రూ.లో) : 13,77,479/- బిడ్ సెక్యూరిటీ (రూ.లో) : 27,600/-, పూర్తి వ్యవధి : 12 నెలలు, ముగింపు తేది : 22.09.2023, 15.00 గం.

వెబ్‌సైట్ వివరాలు : www.ireps.gov.in, టెండర్ యొక్క పూర్తి వివరాలను చూడగలిగే నోటీసు బోర్డు స్థానం:- అసిస్టెంట్ కార్యాలయం. డివిల్. ఎలెక్. ఇంజనీర్, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి

తదుపరి టెండర్ షరతులు/వివరాల కొరకు (టెండర్ డాక్యుమెంట్లు అందుబాటులో ఉన్నాయి) మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం, కొరిజెండమ్, దయచేసి మా వెబ్‌సైట్ http://www.ireps.gov.in ని సందర్శించండి.

అసి. డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి.
A1397

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు
- కోనసీమలో విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ప్రారంభం

సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఐవి

ప్రజాశక్తి - అమలాపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎస్ఎఫ్ఐ చేపట్టిన 'విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర'ను సోమవారం అమలాపురం జడ్‌పి బాలుర హైస్కూల్ వద్ద ఆయన జెండా ఊపి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఐవి మాట్లాడుతూ.. విద్యార్థులు పోరాట పటిమను అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ర్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలను అందించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దని కోరారు. హైస్కూల్లో స్వీపర్ల తొలగింపు సరికాదన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. హాస్టళ్లల్లో రెగ్యులర్‌గా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, అధ్వాన స్థితిలో ఉన్న వసతిగృహాలను పునర్‌నిర్మించాలని, అమలాపురంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రలో నాయకులు మదన్, ప్రణీత్‌సాయి, శంకర్, సంజన తదితరులు పాల్గొన్నారు.

సురేష్ శాంతో (ఫైల్)

ప్రజాశక్తి మాడుగుల విలేకరి మృతి

ప్రజాశక్తి - అనకాపల్లి

ప్రజాశక్తి వి.మాడుగుల విలేకరి సురేష్ శాంతో (45) సోమవారం ఉదయం మృతి చెందారు. ఆదివారం రాత్రి ఆయన అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో విశాఖలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. సురేష్ శాంతో మాడుగుల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా పని చేశారు. ప్రస్తుతం కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రజాశక్తిలో ఆయన పదేళ్లుగా పనిచేస్తున్నారు. గతంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేశారు. పలు షార్ట్ ఫిల్మ్‌ల్లోనూ ఆయన నటించారు. ఆయన మృతి పట్ల ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం అచ్యుతరావు, జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు, ఉమ్మడి విశాఖ జిల్లా ప్రెస్‌క్లబ్‌ల నాయకులు సంతాపం తెలిపారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మాడుగుల యువత సంతాప సభ నిర్వహించింది.

నంద్యాలలో టీచర్ దారుణ హత్య

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మండలం పెద్దకొట్టాలకు చెందిన టీచర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు నరికి చంపిన సంఘటన నంద్యాలలో చోటు చేసుకుంది. అయ్యలూరులోని నవజీవన్ అంధుర, మూగ పిల్లల పాఠశాలలోఉపాధ్యాయుడిగా నర్సోజి(35) పనిచేస్తున్నారు. స్కూల్ నుండి ఇంటికి వెళుతుండగా పెద్దకొట్టాల రైల్వే బ్రిడ్జి దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు నరికి చంపినట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అధికార పార్టీలో గ్రూపుల పోరు

- వైసిపి నేత ఇంటిపై మరో నేత గ్రూపు దాడి

ప్రజాశక్తి-భట్టిప్రోలు (బాపట్ల జిల్లా)

అధికార పార్టీలో గ్రూపుల పోరు తారాస్థాయికి చేరింది. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లికోన గ్రామంలో సోమవారం రాత్రి ఒక గ్రూపు వారు మరో గ్రూపునకు చెందిన వారి బైకులను ధ్వంసం చేయడమే కాకుండా కారు అద్దాలు పగలగొట్టి బీభత్సం సృష్టించారు. గ్రామ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపిటిసి సభ్యులు సేరు శ్రీనివాసరావు, మాజీ గ్రామ సర్పంచ్ మండవ రామకోటేశ్వరరావుల మధ్య పార్టీ వ్యవహారాల్లో గత కొన్ని రోజులుగా విభేదాలు నెలకొన్నాయి. పార్టీకి వ్యతిరేకంగా రామకోటేశ్వరరావు, కుమారస్వామి వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ రామకోటేశ్వరావును పార్టీ నుండి తొలగిస్తున్నట్లు ఇటీవల శ్రీనివాసరావు మౌఖికంగా ప్రకటించారు. అప్పటినుండి గ్రామంలో అధికార పార్టీ నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఒక దశలో పార్టీని వీడే ఆలోచనలో రామకోటేశ్వరరావు, కుమారస్వామి ఉన్నట్లు ప్రచారం జరిగింది. వీరిని భయపట్టాలనే ఆలోచనతో శ్రీనివాసరావు గ్రూపు సోమవారం రాత్రి కుమారస్వామి ఇంటిముందు ఉన్న నాలుగు బైకులు, ఒక కారును ధ్వంసం చేసిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడ్డొచ్చిన కుమారస్వామిపై, ఆయన కుటుంబసభ్యులపై కూడా దాడిచేసినట్లు సమాచారం. దీంతో కుమారస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన గ్రూపుపై కుమారస్వామి దాడి చేశారని శ్రీనివాసరావు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు రెండు గ్రూపులనూ పిలిపించి.. మాట్లాడారు. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుంటే పార్టీకి నష్టం జరుగుతుందని, అన్నీ మర్చిపోయి పార్టీ కోసం పనిచేయాలని సూచించారు.

ఫారం - ఎ
బహిరంగ ప్రకటన
(ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (కార్పొరేట్ వ్యక్తుల కొరకు ఇన్సాల్వెన్సీ తీర్మాన ప్రక్రియ) రెగ్యులేషన్స్, 2016 క్రింద)
మోహన కాటన్ గిన్నింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఋణదాతల సమాచారం కొరకు

సంబంధిత వివరములు		
1	కార్పొరేట్ డెబ్‌టార్ పేరు :	మోహన కాటన్ గిన్నింగ్ ప్రైవేట్ లిమిటెడ్
2	కార్పొరేట్ డెబ్‌టార్ వారి ఇన్‌కోపరేషన్ తేది	26-03-2013
3	అథారిటీ క్రింద గల కార్పొరేట్ డెబ్‌టార్ ఇన్‌కార్పొరేటెడ్ / రిజిస్టర్డు	ఆర్‌ఓసి - విజయవాడ
4	కార్పొరేట్ ఇడెంటిటి నెం. : / లిమిటెడ్	U17291AP2013PTC086614
5	కార్పొరేట్ డెబ్‌టార్ రిజిస్టర్డు ఆఫీస్ చిరునామా మరియు ప్రిన్సిపల్ ఆఫీస్ (ఉన్నట్లయితే)	డి.నెం.3-153, గరపాడు (పోస్టు), వట్టి చెరుకూరు (మండలం), గుంటూరు జిల్లా, కృష్ణా, ఆం.ప్ర.-522017, ఇండియా
6	గౌరవనీయం కార్పొరేట్ డెబ్‌టార్ ఇన్‌సాల్వెన్సీ కమెన్స్‌మెంట్ తేది	ప్రొనౌన్స్‌మెంట్ ఆర్డర్ తేది.01-09-2023 ఆర్డర్ లభించు తేది మరియు ఆర్డర్ రశీదు తేది.-04-09-2023
7	ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ముగించుటకు అంచనా తేది	28-02-2024
8	ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ గా నియమంచబిడిన రిజల్యూషన్ ప్రొఫెషనల్ వారి పేరు మరియు రిజిస్ట్రేషన్ నెంబర్	సిఎ ఇమ్మానేని చైతన్య కిరణ్ రిజిష్టరు నెం. : IBBI/IPA-002/IP-N01257/2023-2024/14280
9	బోర్డు నందు రిజిష్టరు కాబడిన ఇంటీరియమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్ వారి చిరునామా మరియు ఈ-మెయిల్	cirp.mohana2023@gmail.com #40-26-22, టెలిఫోన్ ఎక్స్‌ఛేంజ్ ఎదురుగా, మొహిద్దీన్ వీధి, చంద్రమౌళీపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010
10	ఇంటీరియమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్ వారిని సంప్రదించుటకు ఉపయోగించు చిరునామా మరియు ఈ-మెయిల్	cirp.mohana2023@gmail.com #40-26-22, టెలిఫోన్ ఎక్స్‌ఛేంజ్ ఎదురుగా, మొహిద్దీన్ వీధి, చంద్రమౌళీపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010
11	క్లెయిమ్‌లు సమర్పించుటకు చివరి తేది	19-09-2023
12	మధ్యంతర దివాలా పరిష్కార నిపుణులచే నిర్ధారించబడిన సెక్షన్ 21 లోని సబ్ సెక్షన్ (6ఎ) యొక్క నిబంధన (బి) ఋణదాతల యొక్క వర్గీకరణ	వర్తించదు
13	ఒక్కొక్క క్లాస్‌లో ఋణదాతల యొక్క అధీకృత ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న వధ్యంతర దివాలా నిపుణులుగా గుర్తించబడిన వారి పేర్లు (ఒక్కొ క్లాస్ లో మూడు పేర్లు)	వర్తించదు
14	ఎ) సంబంధిత ఫారములు మరియు బి) అధీకృత ప్రతినిధుల వివరములు లభ్యమగు ప్రదేశం	వెబ్ లింక్ : https://ibbi.gov.in/en/home/downloads

ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మోహన కాటన్ గిన్నింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ ప్రారంభించుటకు తేది.01-09-2023 న నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వారు ఉత్తర్వులు జారీ చేసినారు.
ఎంట్రీ నెం.10, పైన తెలిపిన చిరునామా వద్ద ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్‌కు తేది.19-09-2023 న లేదా ఆలోగా రుజువులతో తమ క్లెయిమ్స్ దాఖలు చేయవలసిందిగా మోహన కాటన్ జిన్నింగ్ ప్రైవేట్ లిమిటెడ్ క్రెడిటార్లను కోరబడుచున్నారు.
ఫైనాన్షియల్ క్రెడిటారు వారి క్లెయిమ్‌లను ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే రుజువులతో దాఖలు చేయవలెను. ఇతర క్రెడిటార్లు అందరూ స్వయంగా లేదా తపాలా ద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానంలో రుజువులతో క్లెయిమ్‌లు దాఖలు చేసుకోవచ్చును.
ఎంట్రీ నెం.12 లో నమోదైనట్లుగా ఒక తరగతికి చెందిన ఒక ఆర్థిక ఋణదాత వారి అధీకృత ప్రతినిధిని ఎంట్రీ నెం.13 లో నమోదైన ముగ్గురు దివాలా నిపుణఉల మధ్య వారి ఇష్టానుసారముగా తెలియజేస్తూ ఫారం సిఎ-వర్తించదు తరగతిలోని అధీకృత ప్రతినిధిగా వ్యవహరిస్తున్నట్లుగా తెలియజేయబడును.
తప్పుడు సమాచారం లేదా అసంబద్ధ సాక్ష్యములు దాఖలు చేసినచో జరిమానాలు విధించబడును.

తేది : 05-09-2023
ప్రదేశం : విజయవాడ
సం/- సిఎ ఇమ్మానేని చైతన్య కిరణ్
ఇంటీరియమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్
IBBI/IPA-002/IP-NO1257/2023-2024/14280

కుంగ్‌ఫూ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నందిగామ (ఎన్‌టిఆర్)

ఐదవ జాతీయస్థాయి ఓపెన్ కుంగ్ ఫూ అండ్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ రైతుపేట శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు బంగారు, వెండి, రజిత పతకాలు సాధించారు. ఈ పోటీలను నిస్కిన్‌కప్ వారు విజయవాడలోని గుజ్జర్ల పద్మాదేవి ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. బ్రౌన్ బెల్ట్ కేటగిరీలో తొమ్మిదవ తరగతికి చెందిన గగన్ స్వర్ణ పతకం, గ్రీన్ బెల్ట్ కేటగిరీలో తొమ్మిదవ తరగతికి చెందిన తేజశ్రీరామ్ స్వర్ణ పతకం, ఎల్లో బెల్ట్ జూనియర్ కేటగిరీల్లో లీలా సత్యనారాయణ, పూర్ణచంద్రరావు వెండి పతకం, కటార్ సీనియర్స్ విభాగంలో లలిత వినోద్, హర్షిత్ విక్రం రజిత పతకాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ గుప్తా ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరాటే అండ్ కుంగ్ ఫు మాస్టర్ వజ్రకుమార్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో డీన్ రవికుమార్, వైస్ ప్రిన్సిపల్ వరుణ్, సి బ్యాచ్ ఇన్‌ఛార్జ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

లార్డ్స్ మార్క్ ఇన్సూరెన్స్ 'బీమా కవచ్' వేదిక ఆవిష్కరణ

న్యూఢిల్లీ : జీవిత, ఆరోగ్య, సాధారణ బీమా పాలసీలను అందించే తమ వినూత్న డిజిటల్ ప్లాట్‌ఫారమ్ "బీమాకవచ్"ను విడుదల చేసినట్లు లార్డ్స్ మార్క్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసెస్ తెలిపింది. ఇది తాజా సైబర్ భద్రతతో ఆడిట్ చేయబడిందని పేర్కొంది. సమగ్ర బీమా కవరేజీని కోరుకునే వారికి తమ డిజిటల్, రిటైల్ విభాగాల ద్వారా వందకు పైగా కార్పొరేట్‌లు, మిలియన్ కంటే ఎక్కువ మంది రిటైల్ క్లయింట్‌లను లక్ష్యంగా చేసుకుని ఈ వేదికను రూపొందించడం జరిగిందని తెలిపింది. రిస్క్ కవరేజ్, ధరల ఆధారంగా వినియోగదారులకు సమాచారం ఇవ్వడానికి సైతం వీలు కల్పిస్తుందని పేర్కొంది.

అపోలో సమగ్ర కనెక్టెడ్ కేర్ సేవలు ప్రారంభం

హైదరాబాద్ : ప్రముఖ వైద్య సేవల చెయిన్ అపోలో హాస్పిటల్స్ కొత్తగా సమగ్ర అనుసంధానిత సంరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది ఇది అపోలో కనెక్టెడ్ కేర్ టెక్నాలజీ ద్వారా రోగి పరిస్థితి ఎప్పటికప్పుడూ తెలుసుకోవడానికి వీలుంటుందని ఆ సంస్థ పేర్కొంది. అత్యవసర అంబులెన్స్, ఇన్ పేషెంట్, పోస్ట్ సర్జరీ, ఇంట్లో సంరక్షణ వంటి రోగి ప్రయాణంలో అనేక కేర్ టచ్ పాయింట్‌లలో క్లినికల్ టీమ్‌లు, నర్సింగ్ సిబ్బందికి రోగి సంపూర్ణ సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపింది. "కేర్ డెలివరీ మొత్తం నమూనా మారుతోంది. వైద్య నిపుణులు, రోగులు పరస్పరం వ్యవహరించే తీరు, ప్రతి టచ్ పాయింట్ వద్ద సంరక్షణను అందించే అవకాశాలను విస్తరించింది. దీంతో రోగులు మెరుగైన ఆరోగ్య ఫలితాలను పొందగలుగుతారు. వైద్యులు నిరంతర సంరక్షణను అందించగలరు. రోగుల భద్రతను మెరుగుపరచడం, క్లినికల్ ఫలితాలను మెరుగు పరిచే కనెక్ట్ చేయబడిన ఆరోగ్య వ్యవస్థను నిర్మించడాన్ని కొనసాగిస్తాం" అని అపోలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి పేర్కొన్నారు.

Chola Enter a better life
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: చోల క్రెస్ట్, సి-54 మరియు 55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
శాఖ చిరునామా: 1వ మరియు 4వ అంతస్తు, శాంతి ప్లాజా, డో.నం.59-14-2ఎ, గాయత్రి నగర్, బెంజి సర్కిల్, విజయవాడ-520008
(రూల్ 8(1) క్రింద) స్వాధీనతా నోటీసు

ఏదైతే, క్రింది సంతకందారు మెసర్స్. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 [illegible]

క్ర. సం	ఋణగ్రహీత పేరు & చిరునామా & ఋణ ఖాతా సంఖ్య	డిమాండ్ నోటీసు తేది	బకాయి మొత్తం	స్వాధీనత తేది
[A]	[B]	[C]	[D]	[E]
1	లోన్ ఎకౌంట్ నం.: X0HEVIJ00002643756 [illegible]	13-06-2023	[illegible]	02-09-2023

[illegible] ఆగిరిపల్లి గ్రామం మరియు మండలం లో ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఎస్‌వై.నం.11/3 క్రింద డో.నం.5-147 మొత్తం స్థలం విస్తీర్ణం మరియు దీని నిర్మాణం కొలిచే 629.00 చ.గ.లు., హద్దులు : తూర్పు: దేశబోయిన దుర్గారావు మరియు శ్రీను ఆస్తి, దక్షిణం: శోభనాపురం రోడ్డు, పడమర: పంచాయతీ రోడ్డు, ఉత్తరం: కొంగిటాల విజయ నిర్మల మరియు ఈగ వెంకట శివ నాగేశ్వరమ్మ ఆస్తి.

తేది: 05.09.2023
ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి,
మెసెర్స్. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref. B1/110/2023 — ది.22-08-2023

భూసేకరణ చట్టం, 2013 లోని సెక్షన్ 93(1) ప్రకారం (ఉపసంహరణం)

భూసేకరణ చట్టం, 2013 లోని సెక్షన్ 93 లోని సబ్-సెక్షన్ (1) ప్రకారం, ఏటపాక మండలం, చిన్ననల్లకుంట గ్రామంలో దిగువ పేర్కొన్న షెడ్యూల్‌లోని అసైన్డ్ భూమికి సంబంధించి భూసేకరణ ప్రక్రియలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇందుమూలంగా ఉపసంహరించుకుంటుంది. ఆర్.ఎస్. నెం. 33/16ఎ మొదలగునవి, 2013 నాటి భూసేకరణ పునరావాసం మరియు పున: స్థాపన చట్టం, 30లో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు సెక్షన్ 11(1) క్రింద శ్రీయుత స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి రిఫరెన్స్ నెం. బి1/110/2023, తేది. 14-03-2023 ద్వారా ప్రాథమిక నోటిఫికేషన్‌లో నోటిఫై చేయబడిన విస్తీర్ణం య. 5.42 సెంట్లు, రెండు రోజువారీ వార్తా పత్రికలలో ప్రచురించబడింది. మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసాధారణ గెజిట్ నెం. పి.ఐ.పి./93/2023, తేది.14-03-2023 లో ప్రచురించబడింది. ప్రజా ప్రయోజనం అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు నిమత్తము.

ప్రణాళిక

మండలం: ఏటపాక — గ్రామం: చిన్న నల్లకుంట

వ. నెం.	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	పూర్తి విస్తీర్ణం ఎకరాలు	భూసేకరణకు సహకరించిన విస్తీర్ణం ఎకరాలు	భూ స్వభావం	యజమాని/ పట్టాదారుని పేరు లేదా అనుభవదారుని పేరు	హద్దులు ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	భూమిపై వున్న భవనములు లేదా మొక్కలు లేదా ఇతరములు
1	33/16A	5.42	5.42	జిరాయితీ పుంజ	నలజల సుగుణ భర్త: సత్యనారాయణ	సర్వే నెం. 111	సర్వే నెం. 33	సర్వే నెం. 33	సర్వే నెం. 33	జామాయిల్ తోట
	మొత్తం:	5.42	5.42							

సం/- **ఎస్.నరళవందనం,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref. B1/99/2023 — ది.22-08-2023

భూసేకరణ చట్టం, 2013 లోని సెక్షన్ 93(1) ప్రకారం (ఉపసంహరణం)

భూసేకరణ చట్టం, 2013 లోని సెక్షన్ 93 లోని సబ్-సెక్షన్ (1) ప్రకారం, ఏటపాక మండలం, మడిమేరు గ్రామంలో దిగువ పేర్కొన్న షెడ్యూల్‌లోని అసైన్డ్ భూమికి సంబంధించి భూసేకరణ ప్రక్రియలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇందుమూలంగా ఉపసంహరించుకుంటుంది. ఆర్.ఎస్. నెం. 3/2, 3/4, 4/1 మొదలగునవి, 2013 నాటి భూసేకరణ పునరావాసం మరియు పున: స్థాపన చట్టం, 30లో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు సెక్షన్ 11(1) క్రింద శ్రీయుత స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి రిఫరెన్స్ నెం. బి1/99/2023, తేది. 11-03-2023 ద్వారా ప్రాథమిక నోటిఫికేషన్‌లో నోటిఫై చేయబడిన విస్తీర్ణం య. 9.75 సెంట్లు, రెండు రోజువారీ వార్తా పత్రికలలో ప్రచురించబడింది. మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసాధారణ గెజిట్ నెం. పి.ఐ.పి./ /2023, తేది.11-03-2023 లో ప్రచురించబడింది. ప్రజా ప్రయోజనం అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు నిమత్తము.

ప్రణాళిక

మండలం: ఏటపాక — గ్రామం: మడిమేరు

వ. నెం.	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	పూర్తి విస్తీర్ణం ఎకరాలు	భూసేకరణకు సహకరించిన విస్తీర్ణం ఎకరాలు	భూ స్వభావం	యజమాని/ పట్టాదారుని పేరు లేదా అనుభవదారుని పేరు	హద్దులు ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	భూమిపై వున్న భవనములు లేదా మొక్కలు లేదా ఇతరములు
1	3/2	1.05	1.05	జిరాయితీ పుంజ	పాకాల శ్రీలత భర్త: కాంతారావు	సర్వే నెం. 3/1	సర్వే నెం. తెలంగాణ	సర్వే నెం. 3/వాగు	సర్వే నెం. 1 వాగు	జామాయిలు తోట
2	3/4	5.00	5.00	జిరాయితీ పుంజ	పాకాల శ్రీలత భర్త: కాంతారావు	సర్వే నెం. 3/3 వాగు	సర్వే నెం. కన్నయ గూడెం	సర్వే నెం. 3/5	సర్వే నెం. 1 & 2 వాగు	జామాయిలు తోట
3	4/1	3.70	3.70	జిరాయితీ పుంజ	పాకాల శ్రీలత భర్త: కాంతారావు	సర్వే నెం. 3	సర్వే నెం. 9	సర్వే నెం. 4/2	సర్వే నెం. 5 వాగు	జామాయిలు తోట
	మొత్తం:	9.75	9.75							

సం/- **ఎస్.నరళవందనం,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

సంపాదకీయం

మోడీ 4-డి సినిమా

భారత్ వెలిగిపోతోందంటూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రముఖ వార్తా సంస్థ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో దేశ ప్రజలకు ఉచితంగా '4-డి' సినిమా చూపించారు. ఈ వారంలో ఢిల్లీలో జరుగుతున్న జి20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఇంటర్వ్యూ చేశారు. మోడీ మాయల మరాఠి అని వేరే చెప్పనవసరం లేదు. తిమ్మిని బమ్మిని చేయగల నేర్పరి అనేది లోకోక్తి. తన తొమ్మిదేళ్ల పాలనలో తిమిరం ఆవహించిన దేశానికి కృత్రిమంగా వెలుగులు అద్దే దుస్సాహసం ఒడిగట్టడంలోనే మోడీ గడుసుదనం కనిపిస్తుంది. రాజుగారి దేవతావస్త్రాలు మాదిరి లేని వెలుగులను ఉన్నట్లు ప్రజలను భ్రమింప చేయడం మోడీకే చెల్లుతుంది. ఇంటర్వ్యూలో ఆయన చేసిన ప్రవచనం 2047 నాటికి దేశంలో కులతత్వం, మతతత్వం ఉండదని, అవినీతి పూర్తిగా అంతమవుతుందనీనూ. కులతత్వం, మతతత్వాలను రెచ్చగొట్టడమే ఎజెండాగా పెట్టుకున్న సంఘ్ పరివారానికి అధికారపక్షాన అన్ని విధాలా అండగా నిలిచిన వ్యక్తే ఇక అటువంటివి ఉండబోవంటే విశ్వసించేదెలా? నాటి గుజరాత్ నరమేధం వేళ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నేటి మణిపూర్ మారణహోమం సమయాన ప్రధానిగా ఉండి ఎందుకు మత హింసను అణచివేయలేక పోయారు? అంతర్జాతీయ సంస్థలనేకం అదానీ అక్రమాల చిట్టాను బహిర్గతం చేస్తున్నా నోరు మెదపకుండా మద్దతిస్తున్న మనిషే అవినీతి పూర్తిగా అంతమవుతుందనడం ఏ రకమైన నైతికతో మోడీయే విపులీకరిస్తే బాగుంటుంది.

'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' నినాదం ప్రపంచ సంక్షేమానికి రోల్ మోడల్ అయిందని గొప్పలు పోయారు ప్రధాని. బిజెపి పాలనలో 'అందరితో కలిసి అందరి అభివృద్ధి' ఏకోశాన కనిపించదు. కార్పొరేట్ల అభివృద్ధే దర్శనమిస్తుంది. మిలియనీర్లు బిలియనీర్లు అవుతుండగా పేదలు నిరుపేదలవుతున్నారని పలు ప్రభుత్వ సర్వే ఏజెన్సీలు, ఫోర్బ్స్ వంటివి ఘోషిస్తున్నాయి. పేదరికం, నిరుద్యోగం గ్రాఫ్ అధ్వానం కాగా ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు అగాధాల్లా తయారవుతున్నాయి. మానవాభివృద్ధి భేషుగ్గా ఉందనడం వంచనే. రాబోయే రోజుల్లో విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో అత్యుత్తమంగా మన దేశం తయారవుతుందంటున్నారు మోడీ. కేంద్రం ప్రతిపాదించిన నూతన విద్యా విధానం కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, మతీకరణలతో నిండిపోయింది. పిల్లలను మరింతగా విద్యకు దూరం చేస్తుంది. ఆరోగ్యరంగం కార్పొరేటీకరించబడుతోంది. కరోనా సమయంలో ఆ పర్యవసానాలు ఆచరణాత్మకంగా గోచరించాయి. బిజెపి జమానాలో సామాజిక న్యాయం అందని ద్రాక్షే. సమాజంలో కుల దొంతరలను ప్రతిష్టించిన మనుధర్మాన్ని అమలు చేయాలనే శక్తుల కుదురు నుంచి పుట్టిన బిజెపి పాలనలో సామాజిక అభివృద్ధి అత్యాశే కాగలదు.

నయా-ఉదారవాద విధానాలను మరింతగా ముందుకు నెట్టే 'విజన్'ను మోడీ ఏకరువు పెట్టారు. వాణిజ్యం, మార్కెట్, అందుకు అవసరమైన సాంకేతికాభివృద్ధిపై కేంద్రీకరించారు. ప్రపంచంలో సౌరశక్తి, జీవ ఇంధనం కూటమి, తద్వారా స్థానిక కార్పొరేట్ల లాభాల సాధనపై మాట్లాడారు. జిడిపి కేంద్రీకృత దృక్పథం నుంచి మానవ కేంద్రీకృత దృక్పథం వైపు మారాలన్నారు. జిడిపి గురించి ఎక్కువ మాట్లాడేది ఆయన, ఆయన ప్రభుత్వమే. అదానీ, అంబానీ ఆదాయాలను, చెప్పులు కుట్టుకొని బతికే నిరుపేద ఆదాయాన్ని కలిపి లెక్కించి జిడిపి వృద్ధిని ఆకాశానికెత్తేది వారే. ఆర్థిక క్రమశిక్షణపై రాష్ట్రాలు స్పృహతో మెలగాలని, ఉచితాలు కూడదని నయా-ఉదారవాద బాణీని వినిపించారు. పేదలకు అందుతున్న అరకొర సబ్సిడీలను కూడా ఎత్తేసి కార్పొరేట్లకు మరింతగా దోచిపెట్టాలన్నదే దీని వెనుక ఉన్న ఉద్దేశం. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తుందన్న మోడీ ఇక్కడా మతతత్వాన్ని లేవదీశారు. పూర్వం అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న మన దేశం ఆక్రమణల మూలంగా దిగజారిందని ముస్లిం రాజుల దండయాత్రలను పథకం ప్రకారం స్ఫురింపజేశారు. డెమొక్రసీ, డెమోగ్రఫీ, డైవర్సిటీ... మూడు 'డి'లు దేశంలో ఉన్నాయి, కొత్తగా డెవలప్‌మెంట్ అనే నాల్గవ 'డి' వచ్చి చేరిందని మొత్తానికి ఫోర్ డి సినిమా చూపించారు. వాజ్‌పేయి సైతం ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్, దేశం వెలిగిపోతోందని ఊదరగొట్టారు. చివరికి ఆయన ప్రభుత్వం ఓడిపోయింది. అబద్ధాలు వండి వార్చే మోడీ ప్రభుత్వానికి అదే గతి పట్టడం ఖాయం.

మహనీయుల మాట



వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్టు, నిరంతరం నేర్చుకొనేవారే ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

Rabindranath Tagore

బ్రిక్స్ వేదిక విస్తరణ

మొదట బ్రిక్స్ కూటమిలో ఐదు దేశాలు ఉండేవి. అవి: బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా. ఆ తర్వాత జోహానెస్‌బర్గ్ శిఖరాగ్ర సమావేశంలో మరో ఆరు దేశాలను కూడా చేర్చుకోవాలని నిర్ణయించారు. అవి: అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్. మొత్తం 22 దేశాలు బ్రిక్స్ లో చేరాలన్న ఉత్సుకతను వ్యక్తం చేయగా వాటిలోంచి పై ఆరింటిని ఎంపిక చేశారు. ప్రస్తుతం బ్రిక్స్‌కు అధ్యక్ష స్థానంలో ఉన్న దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వ వర్గాలు వెల్లడి చేసిన వివరాల ప్రకారం ఏకంగా 40 దేశాలు బ్రిక్స్ లో చేరడానికి సిద్ధంగా ఉన్నాయి. ఉన్నట్టుండి బ్రిక్స్ వేదిక పలుకుబడి ఇంతగా పెరగడానికి కారణం ఏమిటి? అన్న ప్రశ్న సహజంగా తలెత్తుతుంది.

"ఉన్నత స్థాయి" కి చెందిన సామ్రాజ్యవాద దేశాల సరసన నిలిచే అవకాశం నిరాకరించబడినందున కొన్ని పెద్ద దేశాలు తమ స్థాయికి గుర్తింపు వచ్చేలా తగిన పాత్రను ప్రపంచ వ్యవహారాలలో పోషించడానికి వీలుగా బ్రిక్స్ ను ఏర్పాటు చేసుకున్నారని చాలామంది భావిస్తూంటారు. కాని బ్రిక్స్ లో ఉన్న సభ్యదేశాలను చూస్తే వాటి మధ్య చాలా తేడాలు ఉన్నాయి. రష్యా, చైనా ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉన్న దేశాలు. వాటికి అక్కడ వీటో హక్కు ఉంది. వాటిలో ఒకటైన రష్యా ప్రస్తుతం "ఉన్నతస్థాయి" కూటమి దేశాలతో యుద్ధంలో ఉంది. ఇక రెండోది చైనా. ఆ దేశాన్ని తమ ప్రధాన శత్రువుగా "ఉన్నతస్థాయి" దేశాలు ప్రకటించాయి. కాబట్టి ఆ రెండు దేశాలూ "ఉన్నతస్థాయి" దేశాల సరసన చేరడానికి తహతహలాడుతున్నాయని అనుకోలేం. ఇక బ్రిక్స్ ఒక కూటమిగా ప్రపంచ రాజకీయాలలో తలెత్తిన ఏ ప్రధాన పరిణామంలోనూ గణనీయమైన పాత్రను పోషించినట్టు దాఖలా లేదు. బ్రిక్స్ లో చేరితే తమ దేశానికి ప్రపంచ వ్యవహారాలలో ప్రాధాన్యత పెరుగుతుందని అనుకుని అందులో చేరడానికి సన్నద్ధతను వ్యక్తం చేస్తున్న దేశాలు ఏవీ లేవు. తమ ప్రాధాన్యతను పెంచుకోడానికే వివిధ దేశాలు బ్రిక్స్ లో చేరడానికి సిద్ధపడుతున్నాయన్న వాదన ప్రస్తుత ప్రపంచంలోని రాజకీయ ఆర్థిక పరిస్థితులను పట్టించుకోలేదు.

ప్రభాత్ పట్నాయక్

ప్రస్తుత ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభంలో మునిగివుంది. ప్రభుత్వాల ప్రతినిధులు, మితవాద ఆర్థికవేత్తలు ఎప్పుడూ ఉన్న వ్యవస్థను సమర్థించుకుంటూవుంటారు. అలాంటివారు సైతం ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక దీర్ఘకాలిక ఆర్థికమాంద్యంలో చిక్కుకుని వుందని అంటున్నారు. పాత అంతర్జాతీయ సంస్థలు ఇటువంటి సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనడానికి సరిపోవు. ఆ సంస్థల ఇప్పటి అవసరాలకు తగినట్టుగా మార్పు చేసే సత్తా సామ్రాజ్యవాద దేశాలకు లేదు. లేదా కొత్తదనాన్ని కలిగివుండి ప్రస్తుత పరిస్థితులకు తగినవిధంగా వ్యవహరించగల కొత్త సంస్థలను ఏర్పాటు చేయగల సత్తా కూడా వాటికి లేదు. ఈ పరిస్థితులలో బ్రిక్స్ ఒక ఆశాజనకమైన నవ్యత్వాన్ని ప్రదర్శిస్తోంది. ప్రస్తుతం సామ్రాజ్యవాదుల గుప్పెట్లో ఉండే సంస్థలు ఆర్థిక సంక్షోభాన్ని నివారించగలవన్న విశ్వాసం క్రమంగా తరిగిపోతోందనడానికి తార్కాణమే బ్రిక్స్ పలుకుబడి పెరగడం. దీనిని బట్టి బ్రిక్స్ ను ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక కూటమిగా చూడకూడదు. అందులో కొన్ని సభ్యదేశాలు నిస్సందేహంగా సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరినే కలిగివున్నాయి. కాని ఈజిప్ట్, ఇథియోపియా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటివి ఏ కోశానా సామ్రాజ్యవాద వ్యతిరేకం కాదు. ఇప్పుడు బ్రిక్స్ లో చేరగానే అవి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకం అయిపోయాయని భావించలేం. సామ్రాజ్యవాదంతో విభేదించకుండానే ప్రస్తుత పరిస్థితుల్లో ఆశాజనకమైన వేరే దారి ఏదైనా ఉన్నదా అని అన్వేషిస్తున్న క్రమంలో వాటికి బ్రిక్స్ అటువంటి ఒక వేదికగా కనిపించింది. అందులో చేరడం ద్వారా రానున్న రోజుల్లో తమకు కావలసిన కీలకమైన సహాయం లభించవచ్చునని అవి ఆశిస్తున్నాయి.

ఈజిప్ట్, ఇథియోపియా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటివి ఏ కోశానా సామ్రాజ్యవాద వ్యతిరేకం కాదు. ఇప్పుడు బ్రిక్స్ లో చేరగానే అవి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకం అయిపోయాయని భావించలేం. సామ్రాజ్యవాదంతో విభేదించకుండానే ప్రస్తుత పరిస్థితుల్లో ఆశాజనకమైన వేరే దారి ఏదైనా ఉన్నదా అని అన్వేషిస్తున్న క్రమంలో వాటికి బ్రిక్స్ అటువంటి ఒక వేదికగా కనిపించింది. అందులో చేరడం ద్వారా రానున్న రోజుల్లో తమకు కావలసిన కీలకమైన సహాయం లభించవచ్చునని అవి ఆశిస్తున్నాయి.

ప్రస్తుతం విస్తరించిన బ్రిక్స్ లో మూడు రకాల దేశాలు ఉన్నాయి. సామ్రాజ్యవాదం ఏకపక్షంగా ఆంక్షలు విధించడం, లేదా వాటికి నష్టం కలిగించేలా "రక్షణ" విధానాలను అనుసరించడం కారణంగా కొన్ని దేశాలు, చమురు, సహజవాయువు ఉత్పత్తి చేసే దేశాలు, ఇప్పటికే ప్రపంచ సంక్షోభంలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న దేశాలు, సమీపకాలంలో ఇబ్బందులను ఎదుర్కొనబోతున్న దేశాలు ఉన్నాయి. చైనా, రష్యా, ఇరాన్ మొదటి కోవకి చెందినవి. రష్యా, ఇరాన్, సౌదీ అరేబియా, యుఎఇ రెండో కోవకి చెందుతాయి (ఒక దేశం రెండు, మూడు రకాల ఇబ్బందులను ఎదుర్కొనడం జరుగుతోంది). ఈజిప్ట్, ఇథియోపియా, అర్జెంటినా, మూడో కోవకి చెందుతాయి. రాబోతున్న సంక్షోభంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు అవసరం అన్న దృష్టితో ఉన్నవి బ్రెజిల్, ఇండియా.

ఎటువంటి భద్రతా మండలి ఆమోదమూ లేకుండానే ఏకపక్షంగా సామ్రాజ్యవాద దేశాలు విధించిన ఆంక్షలను ఎదుర్కొంటున్న దేశాలకు ఆ ఆంక్షల నుండి తప్పుకొని బైటపడడానికి మార్గాంతరంగా బ్రిక్స్ ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ అర్థంలో చూసినప్పుడు ఇరాన్ ను సభ్యదేశంగా అంగీకరించాలన్నది జోహానెస్‌బర్గ్ శిఖరాగ్ర సమావేశం తీసుకున్న నిర్ణయాలలోకెల్లా ప్రాముఖ్యత కలిగివుంది. ఇరాన్ మీద తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధించడమే కాదు, సంపన్న పశ్చిమ దేశాల్లో ఇరాన్ దాచుకున్న విదేశీ మారకపు నిల్వలను ఆ దేశం వినియోగించుకోడానికి వీలు లేకుండా ఆంక్షకు గురైన మొదటి దేశం అది. సామ్రాజ్యవాద దేశాలు తమకు తాముగా ఏర్పాటు చేసుకున్న నిబంధనలకు సైతం ఇది విరుద్ధం. సామ్రాజ్యవాద ముఠా నుండి ఇటువంటి దాష్టీకం రాను రాను మామూలైపోయింది. తాజాగా ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా ఇదే విధమైన ఆంక్షను ఎదుర్కొంటోంది. విదేశాల్లోని తన స్వంత విదేశీ మారకపు నిధులను రష్యా ఇప్పుడు వినియోగించుకోడానికి వీలు లేకుండా ఆంక్ష పెట్టారు. సామ్రాజ్యవాదులు పన్నిన ఈ ఉచ్చు నుంచి బైటపడాలంటే బ్రిక్స్ అందుకు ఒక సాధనంగా ఉపయోగపడుతుంది.

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా తమ ఉత్పత్తుల ధరలు పడిపోవడం చమురు, సహజవాయువు ఉత్పత్తి చేసే దేశాలు ఎదుర్కొంటున్న సమస్య. ఆ ధరలను పడిపోకుండా నిలబెట్టడానికి ఆ దేశాలు తమ ఉత్పత్తుల పరిమాణాన్ని తగ్గించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. అప్పుడు వాటి డిమాండ్ పెరిగి ధరలు నిలబడతాయి. కాని ఇది అమెరికాకు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. బైడెన్ తో సహా చాలామంది అమెరికా పనుపున సౌదీ అరేబియా పర్యటించి ఒపెక్ దేశాల సమావేశంలో ఉత్పత్తుల పరిమాణం తగ్గించుకోవాలన్న నిర్ణయం జరగకుండా ఉండాలని ఒత్తిడి తెచ్చారు. కాని అమెరికా ఒత్తిడులు ఫలించలేదు. ఆ తర్వాత కూడా పలుమార్లు ఒపెక్ కూటమి తమ ఉత్పత్తుల పరిమాణాన్ని తగ్గిస్తూ నిర్ణయాలను ప్రకటించింది. తమ సహజవనరుల ఉత్పత్తి విషయంలో ఆ యా దేశాలు తగిన స్వేచ్ఛ కలిగివుండాలంటే కేవలం అమెరికా మీదే ఆధారపడి అంతర్జాతీయ సంబంధాలను నెరిపితే చాలదని, తమ సంబంధాలను విస్తృత పరచుకోవాలని, అదే సమయంలో అమెరికాకు ఆగ్రహం కలిగించకుండా వ్యవహరించాలని ఆ దేశాలు భావిస్తున్నాయి. అందుకు వాటికి బ్రిక్స్ ఒక దారిగా కనిపించింది.

ఇక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులలో ఉన్న ఈజిప్ట్, అర్జెంటీనా, ఇథియోపియా వంటి దేశాలు, అంత మోతాదులో కాకపోయినా, ఇబ్బందులను ఎదుర్కొంటున్న బ్రెజిల్, ఇండియా, దక్షిణాఫ్రికా దేశాలు బ్రిక్స్ పట్ల ఆకర్షితులవడానికి కారణం వేరే ఉంది. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వ్యాపారం జరపగలిగే అవకాశం బ్రిక్స్ ద్వారా జరిగే వీలుంది. ఇటీవలే బ్రెజిల్, చైనా తమ స్థానిక కరెన్సీల రూపంలో పరస్పరం వ్యాపారం చేసుకోడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. అదే మాదిరిగా ఇండియా, యుఎఇ ల మధ్య కుదిరింది. బ్రిక్స్ సభ్య దేశాల నడుమ ఈ తరహా ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందాలు రానున్న కాలంలో మరిన్ని జరుగుతాయి. బ్రిక్స్ పట్ల ఆకర్షితులవడానికి ఇదొక ప్రధాన కారణం.

ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందం కుదుర్చుకునే దేశాల కరెన్సీల విలువలను సాపేక్షంగా నిర్ణయించుకుంటారు. అప్పుడు డాలర్ అనేది ఆ వ్యాపారంలో అవసరం ఉండదు. అప్పుడు ఆ రెండు దేశాలకూ పరస్పరం వ్యాపారం జరుపుకోడానికి ఎక్కువ కరెన్సీ అందుబాటు లోకి వస్తుంది (అదే డాలర్ అయితే దానిని పరిమితంగానే నిల్వ ఉంచుకోగలుగుతాయి). అప్పుడు వాటి వ్యాపారం కూడా విస్తరిస్తుంది. దానితోబాటు కరెన్సీ చలామణీ కూడా పెరుగుతుంది. డాలర్ నిల్వల కొరత అనే సమస్య ఆ దేశాల వ్యాపారానికి అవరోధంగా ఇంకెంతమాత్రమూ ఉండదు.

ఐతే ఇది సమస్యలో సగభాగానికి మాత్రమే పరిష్కారం. దానితోబాటు ఇంకొక అంశాన్ని కూడా పరిష్కరించుకోవాలి. రెండు దేశాల నడుమ వ్యాపారం జరిగినప్పుడు ఆ రెండింటిలో ఒక దేశం రెండో దేశానికి చేసిన ఎగుమతుల విలువ ఎక్కువగా ఉండి దిగుమతుల విలువ తక్కువగా ఉంటే అప్పుడు చెల్లింపుల మిగులు ఒక దేశానికి, లోటు రెండో దేశానికి ఏర్పడుతుంది. ఆ తేడాను భర్తీ చేయడానికి మిగులు ఉన్న దేశం వెంటనే గాని, సమీప భవిష్యత్తులో గాని రెండో దేశం నుండి ఎక్కువ సరుకులను దిగుమతి చేసుకోవాల్సి వుంటుంది. ఇలా చేస్తే విదేశీ వ్యాపారంలో లోటును భర్తీ చేసుకోడానికి రుణం తీసుకోవలసిన అగత్యం తలెత్తదు. పైగా డాలర్ రుణం కోసం దేవులాడవలసిన పని లేనప్పుడు ఆ రెండు దేశాలూ తమ తమ ఉత్పత్తుల సామర్థ్యాన్ని మరింత పెంచుకోగలుగుతాయి. తద్వారా ప్రపంచ సంపద పెరుగుతుంది. అంటే డాలర్ నియంత్రణ నుండి బైటపడగలిగితే ద్వైపాక్షికంగా ఒప్పందాలు కుదుర్చుకునే దేశాలకు లాభదాయకంగా ఆ ఒప్పందాలు పరిణమిస్తాయి.

ఇటువంటి ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందాలను బ్రిక్స్ ప్రోత్సహిస్తే, వాణిజ్యలోటు ఏర్పడిన దేశాలు అప్పులపాలు గాకుండా ఆ దేశం నుండి రెండో దేశం వాణిజ్యలోటు భర్తీ అయ్యే విధంగా సరుకులను దిగుమతి చేసుకుంటే, అప్పుడు అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోలుకోడానికి ఎంతో దోహదం చేస్తుంది. అప్పుడు బ్రిక్స్ సామ్రాజ్యవాద ఆధిపత్యానికి ఒక నిజమైన ప్రత్యామ్నాయ వేదికగా వ్యవహరించ గలుగుతుంది.

బ్రిక్స్ బ్యాంక్ కు ప్రస్తుతం డైరక్టర్‌గా వ్యవహరిస్తున్న దిల్మా రౌసెఫ్ (ఈమె గతంలో బ్రెజిల్ అధ్యక్షురాలు) తమ బ్యాంక్ వాణిజ్య రుణాల పరిష్కారం నిమిత్తం గాని, రుణాల చెల్లింపుల విషయంలో సహాయం చేయడానికి గాని సిద్ధంగా లేదని స్పష్టం చేశారు. అందుచేత మూడవ ప్రపంచ దేశాలు గాని, బ్రిక్స్ సభ్య దేశాల వర్గకైనా గాని తమ రుణ సమస్యల పరిష్కారానికి ఐఎంఎఫ్ ను ఆశ్రయించడం వినా వేరే మార్గం లేదు. అప్పుడు ఐఎంఎఫ్ విధించే షరతులకు, పొదుపు చర్యలకు లోబడి వుండక తప్పదు. ఐతే ద్వైపాక్షిక వ్యాపారాన్ని ప్రోత్సహించే విషయంలో దిల్మా ఆసక్తి చూపుతున్నారు. అదే సమయంలో మౌలిక వసతుల కల్పన నిమిత్తం మూడవ ప్రపంచ దేశాలకు రుణాలు ఇవ్వడానికి సుముఖంగా ఉన్నారు. దీనివలన సామ్రాజ్యవాద దేశాల పట్టును కొంతమేరకు సడలించడం సాధ్యమౌతుంది.

బ్రిక్స్ సభ్యదేశాలలోని వామపక్షవాదుల మధ్య ఇప్పుడు ఒక చర్చ నడుస్తోంది. సామ్రాజ్యవాదం బ్రిక్స్ ను గురించి ఏమనుకుంటోంది ? అన్నది వారి ప్రశ్న. కొంతమంది బ్రిక్స్ సామ్రాజ్యవాద వ్యతిరేక వేదికే గాని, పెట్టుబడిదారీ వ్యతిరేక వేదిక కాదు అని వాదిస్తున్నారు. నిజానికి బ్రిక్స్‌ను సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక అని కూడా అనలేం. మోడీ, సౌదీ రాజు, ఈజిప్ట్ కు చెందిన సిసి వంటి వారు ఆ యా దేశాల అధినేతలుగా ఉండగా వారి ఆధ్వర్యంలోని బ్రిక్స్ సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక ఎలా ఔతుంది? మరి బ్రిక్స్ వల్ల ఉపయోగం ఏమిటి ? సామ్రాజ్యవాద పెత్తనం కింద ఉన్న ఐఎంఎఫ్ తదితర సంస్థలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై చలాయిస్తున్న గుత్తాధిపత్యాన్ని ఎంతో కొంతమేరకు బ్రిక్స్ బలహీనపరచగలుగుతుంది. అది తప్పకుండా ఒక సానుకూల పరిణామమే. దానితోటే సామ్రాజ్యవాదానికి ఏదో పెద్ద దెబ్బ తగులుతుందని అనుకోలేం. ఐతే ప్రపంచ శ్రామిక వర్గం సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోడానికి మరింత సానుకూల వాతావరణాన్ని బ్రిక్స్ సృష్టించగలదు.

(స్వేచ్ఛానుసరణ)

సందర్భం

సమస్యల పద్మవ్యూహంలో ఉపాధ్యాయులు

ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యారంగం ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్న వేళ, ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాము. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద మొదలైన పథకాల ద్వారా అద్భుతాలు చేస్తున్నామని, పెద్ద ఎత్తున ఖర్చు చేసి మార్పులు తెస్తున్నామని ఆడంబరంగా ప్రకటిస్తూ ఉండగా, మరోవైపు క్షేత్ర స్థాయిలో విద్యార్థులతో సన్నిహిత సంబంధాలు కలిగి, ప్రత్యక్షంగా ప్రతినిత్యం విద్యార్థులతో మెలిగే ఉపాధ్యాయులు అసంతృప్తితో, నిరాశతో, ఒత్తిడితో పనిచేస్తు న్నారు. సృజనాత్మకంగా పని చేయవలసిన ఉపాధ్యాయులు ఒత్తిడి వలన తీవ్ర ఆందోళనతో ఉంటు న్నారు. దీనికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న విధానాలే.

జీవో నెం.117

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ పేరుతో జారీ చేసిన జీవో నెం.117 పాఠశాల విద్యకు ఉరితాడుగా మారింది. ప్రపంచ బ్యాంక్ 'సాల్ట్' ఒప్పందం ప్రకారం ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించటమే దీని లక్ష్యం. జీవో జారీ చేసే సందర్భంలో ఉపాధ్యాయ సంఘాలతోగానీ, ఎమ్మెల్సీలతోగానీ ఎటువంటి చర్చలు జరపలేదు. జీవో ద్వారా ఉపాధ్యాయులపై పని భారాన్ని పెంచారు. జీవో నెం.117 యథాతథంగా అమలు చేస్తే 20 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు 'సర్‌ప్లస్'గా మారుతున్నాయి. గత ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో వేలాది ప్రాథమిక పాఠశాలలను మూసివేసిందని, ఆ మేరకు బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ప్రాథమిక విద్యను దూరం చేసిందని, తమ ప్రభుత్వం ఏ ప్రాథమిక పాఠశాలను మూసివేయబోదని ఉపాధ్యాయ కొరత లేకుండా చూస్తామని ముఖ్యమంత్రి ఆర్భాటంగా ప్రకటించారు. కానీ జీవో నెం.117 ద్వారా ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేయడం ఆచరణలో ప్రభుత్వ పాఠశాలలకు శరాఘాతంగా మారింది. జీవో నెం.117ను వెంటనే ఉపసంహరించుకోవాలి.

కె.యస్. లక్ష్మణరావు

ఉపాధ్యాయులపై ప్రవీణ్ ప్రకాష్ ఒత్తిడి

పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా సీనియర్ ఐ.ఎ.యస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ పదవిని స్వీకరించిన నాటి నుంచి క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. విద్యాశాఖ ఉన్నత అధికారిగా పాఠశాలలను సందర్శించే హక్కు ఆయనకు ఉన్నది. కాని పాఠశాలలు సందర్శించిన సమయంలో ఆయన ప్రవర్తిస్తున్న విధానం ఉపాధ్యాయులపై, విద్యాశాఖ అధికారులపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నది. అనేకమంది విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఆయన సందర్శించిన అనేక చోట్ల ఉపాధ్యాయులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన పరిశీలించిన అంశాలను ఉపాధ్యాయు లకు సలహాల రూపంలో చెప్పకుండా, హెచ్చరికలు చేయటంతో ఆందోళన పడుతున్నారు. ప్రవీణ్ ప్రకాష్ ఒక ప్రాంతాన్ని లేక పాఠశాలను సందర్శిస్తారనే వార్త తెలియగానే ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ అంశాలను ఎమ్మెల్సీలు ఆయన దృష్టికి తీసుకువెళితే... తన పద్ధతి అంతేనని, మార్చుకునేది లేదని స్పష్టంగా చెప్పేశారు. ప్రభుత్వం ఆయనను పాఠశాల విద్యాశాఖ నుంచి తక్షణమే బదిలీ చేయవలసిన అవసరమున్నది.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

బోధనేతర పనుల ఒత్తిడి

విద్యారంగంలో ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంస్కరణల వలన ఉపాధ్యాయులు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కుంటున్నారు. బోధన కంటే బోధనేతర పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నది. సమగ్రశిక్ష, ఎస్.సి.ఇ.ఆర్.టి నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణలు సగానికిపైగా ఉపయోగం లేకపోగా, ఉపాధ్యాయులను బడిలో లేకుండా చేస్తున్నాయి. ఉపాధ్యాయులు 14 రకాల 'యాప్‌లు' ఉపయోగించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఉపాధ్యా యుల సమయమంతా 'యాప్'ల తోనే గడిచిపోతున్నది. నాడు-నేడు పనులు ప్రధానోపాధ్యాయులకు భారంగా మారాయి. ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టలేకపోతు న్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 670 మండలాలలో 400 మండలాలలో 'ఇంటర్నెట్' సరిగా పనిచేయని పరిస్థితి ఉన్నది. ఉపాధ్యాయు లను బోధనేతర పనుల నుంచి విముక్తులను చేసినప్పుడే వారు బోధనపై దృష్టి పెట్టగలుగుతారు. 'యాప్'ల నిర్వహణ, నాడు-నేడు తదితర పనులను గ్రామ, వార్డు సచివాల యాలకు అప్పగించడం గురించి విద్యాశాఖ ఆలోచించాలి.

ప్రజాస్వామ్యంలో సంఘాలతో చర్చించటం ఒక సాధారణమైన అంశం. కానీ గత కొన్నేళ్లుగా ప్రభుత్వం గానీ, పాఠశాల విద్యాశాఖ కానీ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను పాటించకుండా, ఏకపక్ష నిర్ణయాలు చేయటం ప్రస్తుత పరిస్థితులకు ఒక ప్రధానమైన కారణం. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను గుర్తించి నిర్ణయాలు చేయవలసిన అవసరం వున్నది.

టెక్నాలజీ - బైజూస్ కంటెంట్

వేగంగా పెరుగుతున్న టెక్నాలజీ, వర్చువల్ క్లాస్‌రూం విధానం, ఉపాధ్యాయుడికి ప్రత్యామ్నాయం కాదని ఇటీవల 'యునెస్కో' నివేదికలో పేర్కొన్నది. టెక్నాలజీ ఉపాధ్యాయుడికి బోధనలో సహాయకారిగా ఉంటుందిగానీ, ప్రత్యామ్నాయం కాదని ఆచరణలో రుజువైంది. కరోనా సమయంలో 'ఆన్‌లైన్ టీచింగ్' సమయంలో విద్యార్థుల ప్రవర్తనలో విపరీతమైన మార్పులు చోటుచేసుకున్నాయి. తల్లిదండ్రులు ముక్తకంఠంతో 'ఆన్‌లైన్' విధానం కంటే ఉపాధ్యాయుల బోధన అవసరమని అంగీకరిస్తున్నారు. కాని ప్రభుత్వం ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించటానికి ప్రయత్నం చేస్తున్నది. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా టెక్నాలజీని ప్రవేశపెడుతున్నది. గత సంవత్సరం 8వ తరగతి విద్యార్థులకు టాబ్‌లు ఎంపిక చేశారు. ఇదీ మంచిదే. వాటిలో 'బైజూస్ కంటెంట్' పెట్టారు. వీటిపై ఉపాధ్యాయులకు శిక్షణ లేదు. పాఠ్యపుస్తకాలలో కంటెంట్‌కు, బైజూస్ కంటెంట్‌కు 'సింక్' కావటం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికే సగం టాబ్‌లు మూలపడ్డాయి. టెక్నాలజీపై క్రమపద్ధతిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి.. ఉపయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఇటీవల పాఠశాల విద్యాశాఖ హడావిడిగా ప్రవేశపెట్టిన 'టోఫెల్' పరీక్షా విధానం అమలు తీరు వైఫల్యం చెందినది.

ఉపాధ్యాయ ఖాళీలు-డి.యస్.సి

2019లో ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక ఒక్క డి.యస్.సి నోటిఫికేషన్ విడుదల కాలేదు. ఇప్పటికి 20 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఒక అంచనా. ప్రస్తుత బదిలీలు, ప్రమోషన్ల అనంతరం పరిశీలన చేస్తే అనేక వెనుకబడిన ప్రాంతాలలో ఉపాధ్యాయ ఖాళీలు వేల సంఖ్యలో ఉన్నాయి. 5 లక్షల మందికిపైగా నిరుద్యోగ అభ్యర్థులు డి.యస్.సి నోటిఫికేషన్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాలలో వేలాది ఖాళీలు ఉండగా, ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు వందలాది మందిని అక్రమ బదిలీలకు తెర లేపింది. వెంటనే ప్రభుత్వం డి.యస్.సి నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి.

3,4,5 తరగతుల తరలింపు

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను దగ్గరలోని హైస్కూళ్లకు తరలించాలనే నిర్ణయం వివాదాలకు దారితీసింది. ఈ తరలింపు జాతీయ విద్యా హక్కు చట్టానికి విరుద్ధమైనది. దీని వలన ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమై వేల సంఖ్యలో మూతపడే పరిస్థితి ఏర్పడింది. ఈ విధానాల ద్వారా ప్రభుత్వం పాఠశాలల సంఖ్యను తగ్గించడానికి ప్రయత్నం చేస్తున్నది. తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకత దృష్ట్యా ప్రభుత్వం ఈ తరలింపు విధానాన్ని పునరాలోచన చేసి తరగతులను కొనసాగించవలసిన అవసరమున్నది.

ఉపాధ్యాయుడు-సృజనాత్మకత

ప్రాచీనకాలం నుంచి ఇప్పటిదాకా విద్య నేర్పడంలో ఉపాధ్యాయుడు ప్రాధాన్యతకల సృజనాత్మక పాత్ర పోషిస్తున్నాడు. విద్యార్థి సామాజికీకరణ చెందడంలో, సామాజిక విలువలు పెంపొందించటంలో, ప్రశ్నించే తత్వాన్ని పెంచటంలో ఉపాధ్యాయుడు ముఖ్య పాత్ర పోషించాలి. విద్యార్థులలో స్ఫూర్తిని కలిగిస్తూ విద్యార్థులకు లక్ష్యాలను నిర్దేశించాలి. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, లౌకిక భావనలు, ప్రజాస్వామ్య ఆలోచనలు పెంపొందించటానికి కృషి చేయాలి. కానీ ప్రస్తుతం ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధన చేయలేక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఈ ఒత్తిడిని తగ్గించవలసిన అవసరమున్నది.

ప్రైవేటు ఉపాధ్యాయులు

రాష్ట్రంలో 16 వేల ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో లక్షా ఇరవై వేల మంది ప్రైవేట్ రంగ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరు ప్రభుత్వ ఉపాధ్యాయుల కంటే భిన్నమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వీరు అతి తక్కువ వేతనాలతో, ఉద్యోగ భద్రత లేకుండా, సామాజిక భద్రత లేకుండా పని చేస్తున్నారు. పని గంటలు ఎక్కువగా ఉండటం, సెలవు రోజులలో కూడా పాఠశాలలకు హాజరు కావటంలో తీవ్ర వివక్షతను ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల కోసం ఇంటింటికీ తిరగటం, కొంతమంది విద్యార్థులను చేరిస్తేనే ఇంక్రిమెంట్ ఇవ్వటం మొదలైన విషయాలు ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగంగా మారాయి. ప్రైవేట్ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకై చట్టాలు చేయవలసిన అవసరమున్నది.

ప్రభుత్వ రంగంలో ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు గత 8 దశాబ్దాలుగా అనేక సంఘాలు ఆవిర్భవించి కృషి చేశాయి. ప్రజాస్వామ్యంలో సంఘాలతో చర్చించటం ఒక సాధారణమైన అంశం. కానీ గత కొన్నేళ్లుగా ప్రభుత్వం గానీ, పాఠశాల విద్యాశాఖ కానీ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను పాటించకుండా, ఏకపక్ష నిర్ణయాలు చేయటం ప్రస్తుత పరిస్థితులకు ఒక ప్రధానమైన కారణం. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను గుర్తించి నిర్ణయాలు చేయవలసిన అవసరం వున్నది.

/ వ్యాసకర్త శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083 /

★

ప్రజాశక్తి
www.prajasakti.com

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే....

మతాన్ని ఆయుధంగా వాడుతున్న బిజెపి

- తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శ

చెన్నై : తన లోపాలు, లొసుగులను కప్పిపుచ్చుకునేందుకు మతాన్ని బిజెపి విచ్చలవిడిగా ఉపయోగించుకుంటోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ విమర్శించారు. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మతాన్ని తన ఆయుధంగా మార్చుకుంటోందని అన్నారు. భారతదేశ వ్యవస్థను, ఐక్యతను దెబ్బతీస్తూ, మతపరమైన మనోభావాలను ఉద్దేశ్యపూర్వకంగా రెచ్చగొడుతున్నారని విమర్శించారు. "స్పీకింగ్ ఫర్ ఇండియా" శీర్షికతో పాడ్‌కాస్ట్ ద్వారా మాట్లాడాలనుకుంటున్నట్లు స్టాలిన్ చెప్పారు.

ఎన్నికల ముందు బిజెపి మాట ఇచ్చి తప్పిన వాగ్దానాలు, ముఖ్యంగా సంక్షేమ పథకాలు చాలా వున్నాయని తెలిపారు. ఏటా రెండు కోట్ల మందికి ఉపాధి హామీ, రైతుల ఆదాయాలు రెట్టింపు చేయడం వంటివి అందులో వున్నాయన్నారు. ఆ పార్టీ అనుసరించే విచ్ఛిన్నకర ఎత్తుగడలను స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు. దాదాపు దశాబ్ద కాలం పాటూ అధికారంలో వున్నా చేసిన హామీల్లో ఏ ఒక్కటినీ నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని పణంగా పెట్టి కార్పొరేట్ మిత్రులకు లబ్ది చేకూర్చేందుకే పార్టీ, నరేంద్ర మోడీ తన అధికారాన్ని ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. దిశానిర్దేశం లేని పార్టీగా బిజెపి వుందని స్టాలిన్ పేర్కొన్నారు. ప్రాధాన్యతతో కూడిన ఎలాంటి వారసత్వాన్ని వదిలిపెట్టకుండా కనుమరుగు చేసేలా నరేంద్ర మోడీ మోడల్ ఉందని వ్యాఖ్యానించారు. పైగా తన వైఫల్యాల నుంచి దృష్టిని మరల్చడం కోసమే మతాన్ని విచ్ఛిన్నకర సాధనంగా ఉపయోగించుకుంటోందంటూ స్టాలిన్ విమర్శించారు. మతపరమైన మనోభావాలను రెచ్చగొడుతూ మతోన్మాదాన్ని పెంచిపోషిస్తోందని అన్నారు. గుజరాత్, మణిపూర్, హర్యానాల్లో చోటు చేసుకున్న హింసాకాండను ఇందుకు ఉదాహరణలుగా పేర్కొన్నారు.

భారతదేశ వైవిధ్యతను దేశ వైవిధ్యతను, సమాఖ్యవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో డిఎంకె ఎల్లప్పుడూ ముందు పీఠినే వుంటుందని అన్నారు. ఏకస్వామ్యానికి వ్యతిరేకంగా డిఎంకె ముందు వుండాలని పేర్కొంటున్న పెరారినగర్ అన్నా డిక్లరేషన్‌ను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు అధికారంలోకి రావాలి అనేది నిర్ణయించడంపై దృష్టి పెట్టడం కన్నా ఎవరు అధికారంలోకి రాకూడదో నిర్ణయించడం చాలా కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. ఇండియా ఫోరమ్ పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో చోటు చేసుకున్న కుంభకోణాలు, రాష్ట్రాలపై జిఎస్‌టి ప్రభావం, కేంద్రం విధానాల కారణంగా తమిళనాడు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని నష్టపోవడం గురించి స్టాలిన్ ఆ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. బిజెపి పాలిత రాష్ట్రాలు, బిజెపియేతర రాష్ట్రాల మధ్య నిధుల కేటాయింపులో అసమానతల గురించి ఆయన ప్రముఖంగా చెప్పారు.

భారతదేశ విలువలను పునరుద్ధరించే మార్గమే ఇండియా ఫోరమ్

సామాజిక న్యాయం, లౌకికవాద రాజకీయాలు, సోషలిజం, సమానత్వం, సామాజిక సామరస్యత, రాష్ట్రాల స్వయంప్రతిపత్తి, సమాఖ్యవాదం, వైవిధ్యతలో సమైక్యత వంటి విలువలు కలిగిన భారతదేశం కోసమే తమ పోరాటమని స్టాలిన్ నొక్కి చెప్పారు. అటువంటి దేశాన్ని పునరుద్ధరించడమే ఇండియా ఫోరమ్ లక్ష్యమని స్పష్టం చేశారు. విచ్ఛిన్నకర శక్తుల నుండి దేశాన్ని కాపాడతామని ప్రకటించారు. మణిపూర్, హర్యానాల్లో జాతుల ఘర్షణలను కూడా ఆయన ప్రస్తావించారు. దేశ సాంస్కృతిక, మతపరమైన వైవిధ్యతను కాపాడేందుకు ఇటువంటి సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించడం చాలా ముఖ్యమని చెప్పారు.

చేతులు కలపండి

వీటికోసం జరిగే ఉద్యమంలో చేరాల్సిందిగా ప్రజలను స్టాలిన్ కోరారు. "స్పీకింగ్ ఫర్ ఇండియా" లో కేవలం తన వాణిని మాత్రమే వినిపించడం లేదని, ఇది దేశ సమైక్య వాణి అని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ విలువలన్నీ పరిఢవిల్లే దేశాన్ని రూపొందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఇండియా ఫోరమ్ నిజమైన విజేత అయ్యేలా చూడాలని ఆయన కోరారు.

హిందూత్వకే వ్యతిరేకం : విసికె

సనాతన ధర్మమనేది సమానత్వానికి, సామాజిక న్యాయానికి వ్యతిరేకమని తమిళనాడు యువజన సంక్షేమ శాఖ మంత్రి, డిఎంకె యువజన విభాగ కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై విసికె చీఫ్ తిరుమవలవన్ స్పందించారు. ఆయన హిందువులకు వ్యతిరేకం కాదని, కేవలం హిందూత్వకే వ్యతిరేకమని స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సమానత్వ సిద్ధాంతాలను పునరుద్ధరించడానికే ఆయన ప్రయత్నిస్తున్నారని అన్నారు.

ప్రతి పార్టీకి అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉంది : కాంగ్రెస్

ఉదయనిధి స్టాలిన్ చేసిన 'సనాతన ధర్మం' వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ సోమవారం స్పందించింది. ప్రతి రాజకీయ పార్టీకి తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉందని తెలిపింది. న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలను గౌరవిస్తుందని తెలిపారు. అదే సమయంలో ప్రతి రాజకీయ పార్టీ కూడా తమ అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను కలిగిఉంటాయని కాంగ్రెస్ నమ్ముతుందని అన్నారు. 'ప్రతీ రాజకీయ పార్టీ తమ అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను కలిగిఉంటాయి. మేం ప్రతి ఒక్కరి నమ్మకాలను గౌరవిస్తాం. మా అభిప్రాయం స్పష్టంగా ఉంది. 'సర్వ ధర్మ సమభావ' అనేది కాంగ్రెస్ భావజాలం' అని వేణుగోపాల్ చెప్పారు.

బీహార్ కోర్టులో కేసు

తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్‌లపై బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఒక కోర్టులో పిటిషన్ నమోదైంది. వారి వ్యాఖ్యలతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొంటూ ముజఫర్‌పూర్‌కి చెందిన న్యాయవాది సుధీర్ కుమార్ ఓఝా పిటిషన్ వేశారు.

భారత రాజ్యాంగం పట్ల విధేయతతో వుంటారా?

- నేషనల్ కాన్ఫరెన్స్ నేత లోనెను ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ : జమ్ము కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమని బేషరతుగా అంగీకరిస్తానని, భారత రాజ్యాంగం పట్ల విధేయతతో వుంటానని స్పష్టం చేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా నేషనల్ కాన్ఫరెన్స్ నేత మహ్మద్ అక్బర్ లోనెను సుప్రీంకోర్టు సోమవారం కోరింది. 370వ అధికరణను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. 15రోజులుగా 370వ అధికరణపై సుప్రీంలో వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. 2018లో జమ్ముకాశ్మీర్ అసెంబ్లీలో పాకిస్తాన్ జిందాబాద్ అంటూ లోనె నినాదాలు చేశారని కేంద్రం, జమ్ము కాశ్మీర్ యంత్రాంగం, ఇతర ప్రతివాదులు ఆరోపించారు. భారత రాజ్యాంగం పట్ల తాను విధేయుడిగా వుంటానని పేర్కొంటూ లోనె అఫిడవిట్ దాఖలు చేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా డిమాండ్ చేశారు. దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు చేస్తున్న ప్రయత్నాలను దెబ్బకొట్టేలా ఆయన వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

జమ్ము కాశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించేందుకు కచ్చితమైన కాల పరిమితికి కట్టుబడలేమని అంతకుముందు కేంద్రం తెలిపింది. ఇదే విషయాన్ని సుప్రీంకు తెలియజేసింది. ఇప్పటి నుండి ఎప్పుడైనా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించవచ్చని తెలిపింది. జమ్ము కాశ్మీర్‌కు కేంద్ర పాలిత ప్రాంతమనే హోదా తాత్కాలికమైనదని సొలిసిటర్ జనరల్ పేర్కొన్నారు. 2019లో 370వ అధికరణను రద్దు చేసిన తర్వాత రాష్ట్రంలో తీవ్రవాదం, చొరబాట్లు, రాళ్లు విసిరిన సంఘటనలు, భద్రతా సిబ్బంది మరణాలు తగ్గాయని చెప్పారు. పిటిషనర్ల తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఆ గణాంకాలతో విభేదించారు. రాజ్యాంగబద్ధమైన వాదనల ప్రాతిపదికన ఈ సవాలు అంశం నిర్ణయించబడుతుంది తప్ప కేంద్రం అందజేసే గణాంకాల ఆధారంగా కాదని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ చెప్పారు.

జల్నా లాఠీ-ఛార్జ్‌కు వ్యతిరేకంగా మరాఠా సంస్థల నిరసనలు

పుణే: మహారాష్ట్రలోని జిల్నా జిల్లాలో మరాఠా రిజర్వేషన్ల కోసం ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు లాఠీఛార్జీ చేసిన ఘటనకు వ్యతిరేకంగా సోమవారం అనేక మరాఠా సంస్థలు నిరసనలు నిర్వహించాయి. పుణే జిల్లాలోని బారామతి పట్టణంలో భారీ ఎత్తున ఈ నిరసనలు జరిగాయి. ఏక్‌నాథ్ షిండే-బిజెపి కూటమి ప్రభుత్వం నుంచి ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ బయటకు రావాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. పుణే నగరంలోని కోత్రుడ్ ప్రాంతంలోనూ ప్రతిపక్ష శివసేన (యుబిటి), ఎన్‌సిపి (శరద్‌పవార్ గ్రూపు), కాంగ్రెస్ పార్టీలు నిరసనలు చేశాయి. మరాఠా ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. బిజెపి నాయకుడు, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత ఏడాది నుంచి ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉంటున్నా.. మరాఠా రిజర్వేషన్ల కోసం ఎలాంటి ప్రయత్నమూ చేయలేదని విమర్శించారు. మరాఠాల ఆందోళనను బలవంతంగా అణిచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాగా, శుక్రవారం జిల్నా జిల్లాలోని అంతర్వాలి సారధి గ్రామంలో మరాఠా రిజర్వేషన్లకు మద్దతుగా ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు లాఠీఛార్జి, టియర్‌గ్యాస్ షెల్స్ ప్రయోగించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ఘటనలో 40 మందికి పైగా ప్రజలు గాయపడ్డారు.

సెషన్స్ కోర్టుకే సెంథిల్ బాలాజీ కేసు

మద్రాస్ హైకోర్టు తాజా ఉత్తర్వులు

చెన్నై : తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నమోదు చేసిన మనీలాండరింగ్ కేసుపై మద్రాస్ హైకోర్టు సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసును చెన్నైలోని ఎంపి, ఎమ్మెల్యేల కేసుల ప్రత్యేక కోర్టు నుంచి మళ్లీ ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు బదిలీ చేసింది. ఈ మేరకు జస్టిస్ ఆర్ సురేష్ కుమార్, జస్టిస్ కె కుమరేష్ బాబులతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. మంత్రి దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌ను కూడా సెషన్స్ కోర్టుకు తిప్పిపంపింది. తన బెయిల్ పిటీషన్‌ను ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు విచారించాలా లేక చట్టసభ్యుల ప్రత్యేక కోర్టు విచారించాలా.. అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ మంత్రి సెంథిల్ బాలాజీ దాఖలు చేసిన పిటిషన్ విచారణలో మద్రాస్ హైకోర్టు పై విధంగా తీర్పు ఇచ్చింది.

బృందాకరత్ పిటిషన్‌పై సుప్రీం విచారణ అక్టోబర్ 3కి వాయిదా

న్యూఢిల్లీ : సిఎఎ వ్యతిరేక నిరసనలపై విద్వేష ప్రసంగాలు చేసినందుకు బిజెపికి చెందిన అనురాగ్ ఠాకూర్, ప్రవేష్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, పార్టీ ఢిల్లీ కార్యదర్శి కెఎం తివారీ వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు అక్టోబరు 3కి వాయిదా వేసింది. తొలుత బిజెపి నేతలపై ఎఫ్ఐఆర్ నమోదుకు ట్రయల్ కోర్టు తిరస్కరించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. ఆ ఆదేశాలను బృందాకరత్ సవాలు చేశారు.

ఈ కేసు విచారణను వాయిదా వేయాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు కోరడంతో జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ పంకజ్ మిథాల్‌లతో కూడిన బెంచ్ వాయిదా వేసింది. ఈ కేసులో ప్రతివాదులకు తదుపరి వాయిదా మంజూరు చేయబోమని సుప్రీం తెలిపింది. బృందాకరత్ వేసిన పిటిషన్‌పై ఢిల్లీ పోలీసులకు ఏప్రిల్ 17న సుప్రీం నోటీసులు జారీ చేసింది.

విద్వేష ప్రసంగాలు చేసినందుకు ఆ ఇద్దరు బిజెపి ఎంపీలపై సిపిఎం నేతలు బృందాకరత్, కె.ఎం.తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను గతేడాది జూన్ 13న ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. ట్రయల్ కోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు తిరస్కరించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటే తగిన అథారిటీ నుంచి అనుమతి తీసుకోవాల్సిన అవసరం వుందని పేర్కొంది.

ఆ ఇద్దరు బిజెపి నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారని, ఫలితంగా ఢిల్లీలో ఆందోళనలు జరుగుతున్న రెండు వేర్వేరు ప్రాంతాల్లో మూడు కాల్పుల సంఘటనలు చోటుచేసుకున్నాయని పిటిషనర్లు తెలిపారు. బిజెపితోపాటు విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ తదితర సంస్థల నాయకులు ఢిల్లీలోని నాంగ్లోరు, ఘోండా చౌక్‌తోపాటు వివిధ ప్రదేశాల్లో జరిగిన బహిరంగ సభల్లో హిందూ మతం పేరుతో ముస్లిం సమాజంపై ప్రజలను రెచ్చగొట్టారని పిటిషన్‌లో సిపిఎం నేతలు పేర్కొన్నారు. 'హిందూ మతం పేరుతో రాజ్యాంగ విలువలు, లౌకికవాదానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టారు. దేశ రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో ఇటువంటి సమావేశాలు జరుగుతున్నాయి. ముస్లిం సమాజంపై ఆర్థిక, సామాజిక బహిష్కరణకు నిరంతరం పిలుపు ఇస్తున్నాయి' అని తెలిపారు.

17న హైదరాబాద్‌లో సిడబ్ల్యుసి మొదటి భేటీ

- కెసి వేణుగోపాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) మొదటి సమావేశాన్ని హైదరాబాదులో ఈనెల 17న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఏర్పాటు చేసినట్లు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. సోమవారం నాడిక్కడ ఎఐసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మరో ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్‌తో కలిసి వేణుగోపాల్ మాట్లాడారు. ఈ నెల 17న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం జరుగుతుందని, ఇందులో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్‌లు, ఇన్‌ఛార్జిలు ఉంటారని చెప్పారు. 17వ తేదీ సాయంత్రం హైదరాబాద్ సమీపంలో ర్యాలీ నిర్వహిస్తామని, తెలంగాణలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ హామీలను ప్రకటిస్తుందని వేణుగోపాల్ తెలిపారు.

జిన్‌పింగ్ హాజరుకాకపోవడం నిరాశకు గురిచేస్తోంది

- బైడెన్

వాషింగ్టన్ : జి 20 సమావేశానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకాకపోవడం నిరాశకు గురిచేస్తోందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ పేర్కొన్నారు. ఈ వారం భారత్ పర్యటన కోసం తాను ఎదురుచూస్తున్నానని అన్నారు. ఆదివారం బైడెన్ మాట్లాడుతూ.. భారత్‌లో జి20 సమావేశానికి జిన్‌పింగ్ రావడం లేదనే వార్త నిరాశకు గురిచేసిందని, కానీ జిన్‌పింగ్‌ను తాను చూడబోతున్నానని అన్నారు. తాను భారత్, వియత్నాం పర్యటన కోసం వెళ్తున్నానని అన్నారు. ఆ రెండు దేశాలు అమెరికాతో సన్నిహిత సంబంధాలను కోరుకుంటున్నాయని, అది తమకు కూడా సహాయకారిగా ఉంటుందని భావిస్తున్నామని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ జి20 సదస్సుకు రెండు రోజుల ముందు అంటే ఈ నెల 7న భారత్ రానున్నారు. ఈ నెల 8న ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. 9, 10 తేదీల్లో జి20 సదస్సులో పాల్గొననున్నారు. అనంతరం వియత్నాం వెళ్తారు.

ఉక్రెయిన్ రక్షణ మంత్రి ఉమ్‌రోవ్ !

కీవ్ : ఉక్రెయిన్ రక్షణ మంత్రిని ఈ వారంలో మార్చనున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. క్రిమియా నేత రుస్తెమ్ ఉమ్‌రోవ్‌ను కొత్త రక్షణ మంత్రిగా నియమించనున్నట్లు ఆయన టెలిగ్రామ్‌లో ప్రకటించారు. 550 రోజుల పాటు పూర్తి స్థాయి యుద్ధాన్ని సాగించిన తర్వాత కొత్త నాయకత్వం అవసరమైందని ఆయన ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. సైనికపరంగా, సమాజ పరంగా కొత్త కొత్త వైఖరులతో, విభిన్నమైన కార్యాచరణ రూపాలతో వ్యవహరించడం అవసరమని భావిస్తున్నట్లు చెప్పారు. ఉమరోవ్ గురించి అందరికీ తెలుసునని, కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదని అన్నారు. ఆయన అభ్యర్థిత్వానికి పార్లమెంట్ నుంచి కూడా మద్దతు లభిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

సూడాన్ బాంబు దాడుల్లో 25మంది పౌరులు మృతి

ఖార్టూమ్ : సూడాన్‌లో గత 48గంటల్లో 25మంది పౌరులు మరణించారని మానవ హక్కుల కార్యకర్తలు, మీడియా వార్తలు తెలిపాయి. ఖార్టూమ్‌లో ప్రజల నివాసాలపై తొలుత జరిగిన బాంబు దాడుల్లో ఐదుగురు మరణించారు. అంతకుముందు రోజు నగరంలోని దక్షిణ ప్రాంతంలో జరిగిన వైమానిక దాడుల్లో 20మంది పౌరులు మరణించారు. ఆదివారం నుంచి నగరంపై రాకెట్, శతఘ్నుల దాడులు జరుగుతున్నాయని ప్రజలు తెలిపారు. సూడాన్ సైన్యం, పేరా మిలటరీ బలగాల మధ్య ఐదు నెలల నుండి పోరు సాగుతోంది.

అమెరికా, ఐరోపాలను కుదిపేస్తున్న సమ్మెలు

ఫ్రాన్స్‌లో నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న కార్మికులు

వాషింగ్టన్, బ్రస్సెల్స్ : అమెరికా, ఐరోపా దేశాలను సమ్మెలు, నిరసనలు కుదిపేస్తున్నాయి. విపరీతంగా పెరిగిపోతున్న ధరలొకవైపు, పడిపోతున్న నిజ వేతనాలు, అంతులేని నిరుద్యోగం ఇంకొకవైపు దీంతో ఆగ్రహించిన ప్రజానీకం ఎక్కడికక్కడ వీధుల్లోకి వస్తున్నారు. ఇదివరకెన్నడూ లేని విధంగా నిరసనలు, ఆందోళనలతో ఈ దేశాలు అట్టుడుకుతున్నాయి. మెరుగైన వేతనాలు, ఉపాధి కోసం కార్మికులు అనేక చోట్ల సమ్మెలకు దిగుతున్నారు. ఇటీవల కాలంలో యూరప్‌లో సమ్మెలు, నిరసనలు సర్వసాధారణమైపోయాయి.

గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఆందోళనలు పెరగడమే కాదు, వాటి తీవ్రత కూడా పెరిగింది. అమెరికాలో ఈ ఏడాది ఇప్పటివరకూ 230 సమ్మెలు జరిగాయి. 3,20,000మందికి పైగా కార్మికులు సమ్మెల్లో పాల్గొన్నారు. సమ్మెలు, పికెటింగ్‌లు, ఇతర రూపాల్లో నిరసనలు గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బాగా పెరిగాయని అమెరికా లేబర్ బ్యూరో, కార్నెల్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ లేబర్ రిలేషన్స్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎయిర్‌లైన్స్, రైల్వేస్, పోస్టల్, కొరియర్ సర్వీసెస్, కార్ల తయారీదార్లు, నర్సులు, టీచర్లు, హాలీవుడ్ రైటర్లు, నటులు ఇలా అన్ని రంగాలకు చెందిన వారు సమ్మె బాటపట్టారు. ఉపాధి భద్రతలో సంక్షోభం నెలకొనడం, పని పరిస్థితులు, జీవన పరిస్థితులు మరింత దారుణంగా మారడం, మరోవైపు కంపెనీ లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీలకు, అలాగే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం వీధుల్లోకి వస్తోంది. ఈ క్రమంలో కార్మికవర్గం కొన్ని విజయాలు సాధించింది. ఒప్పందాలు కుదిరాయి. అమెరికా కార్మిక శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2022లో 23సార్లు సమ్మెలు చోటు చేసుకున్నాయి. 2009లో కేవలం అయిదు సార్లు సమ్మె జరగ్గా, గతేడాది అది 23కి పెరిగింది.

యూరప్‌లో స్తంభించిన రవాణా

యూరప్‌లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. సమ్మెలు, పని నిలుపుదల కారణంగా వందలాది విమానాలు నిలిచిపోయాయి. రైళ్లు, ప్రభుత్వ రవాణా స్తంభించిపోయింది. కొత్త పెన్షన్ పథకం, రిటైర్‌మెంట్ వయసు పెంచాలన్న ఫ్రాన్స్ ప్రభుత్వ ప్రతిపాదనలను నిరసిస్తూ అక్కడ తీవ్ర స్థాయిలో ఆందోళనలు జరిగాయి. భద్రత, ఇతర రంగాల కార్మికులు తమ కార్యకలాపాలను నిలుపుచేయడంతో జర్మనీలోని బెర్లిన్, ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయాల్లో విమాన సర్వీసులు రద్దయ్యాయి. తక్కువ వేతనాల పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బ్రిటన్‌లో రైల్వే కార్మికులు మూడుసార్లు సమ్మెకు దిగారు. కొన్ని యురోపియన్ దేశాల్లో వాకౌట్లు, సమ్మెలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. నయా ఉదారవాద విధానాల అమలు తీవ్రం కావడంతో పడుతున్న భారాలు, యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికవర్గం భారీ ఎత్తున ఆందోళనలకు దిగుతోందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

పైన పటారం...

- లెక్కలతో తప్పుదారి పట్టిస్తున్న మోడీ సర్కారు
- సర్వే గణాంకాల్లో పారదర్శకత లోపం
- జిడిపిపై ప్రభుత్వ వాదనలు నిరాధారం, నమ్మశక్యం కానివి
- ఆర్థికవేత్తలు, నిపుణులు అభిప్రాయం

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేశామని ప్రచారం చేసుకుంటోంది. వాస్తవానికి దేశంలో అభివృద్ధి తీరు పైన పటారం.. లోన లొటారంలా తయారైందని ఆర్థిక వేత్తలు, నిపుణులు విమర్శిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున.. ఇవి మరింతగా తీవ్రమవుతున్నాయి. 5 ట్రిలియన్ల నుంచి 25 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గురించి చర్చలు జరుగుతున్నాయి. మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందనీ, రానున్న రోజుల్లో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని మోడీ, ఆయన టీం ప్రచారాలు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ వాదనలు నిరాధారం

దేశ ఆర్థికం, అభివృద్ధి విషయంలో కేంద్రం ప్రచారాలు నిరాధారమైనవనీ, గణాంకాలతో తప్పుదారి పట్టిస్తున్నదని ఆర్థికవేత్తలు, నిపుణులు చెబుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో ఐదో స్థానానికి చేరుకోవటానికి గత ప్రభుత్వాల విధానాలు, కృషి ఉన్నాయనీ, మోడీ ప్రభుత్వం ఇదంతా తమ గొప్పతనంగా ప్రచారం చేసుకుంటున్నదని తెలిపారు. స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) గణనను, కొన్ని అంశాల ఆధారంగా దాని ఆర్థికవృద్ధి రేటును విశ్వసించలేమని అన్నారు. జిడిపి, ఉపాధి, ద్రవ్యోల్బణం, తలసరి ఆదాయం మొదలైన అంశాల్లో ప్రభుత్వ వాదనలు నమ్మదగినదిగా లేవని, ఇవి నిరాధారమైనవని ఆర్థికవేత్తలు, నిపుణులు అంటున్నారు.

ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా 'అనధికారమే'

మరిన్ని వివరాల్లోకి వెళ్లేముందు, జిడిపి గణాంకాలకు వాటి గణన పద్ధతి, పాత వాస్తవాల కారణంగా ఉన్న భారీ వ్యత్యాసాన్ని ఉదాహరణతో అర్థం చేసుకుందాం. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా అనధికారిక లేదా అసంఘటిత రంగంలోనే ఉంది. ఇందులో వ్యవసాయం మాత్రమే కాకుండా తయారీ, సేవా రంగాలలోని పెద్ద భాగాలు కూడా ఉన్నాయి. ఖాతాలు, గణాంకాలు అందుబాటులో లేనందున దీనిని అనధికారికం అంటారు. కాబట్టి, జిడిపిని లెక్కించేటప్పుడు, ఈ భాగాన్ని అంచనా ఆధారంగా మాత్రమే జోడించాలి. అంచనా పద్ధతిలో లోపం కారణంగా వీటిలో భారీ వ్యత్యాసం వస్తుంది. అందువల్ల, ఈ పద్ధతి తార్కికంగా, పారదర్శకంగా ఉండటం అవసరమనీ ఆర్థిక నిపుణులు తెలుపుతున్నారు.

అధికారిక రంగానికి సంబంధించినంత వరకు, పరిశ్రమల వార్షిక సర్వే నుంచి దాని ఉత్పత్తి డేటాను ముందుగా పొందారు. అధికారిక, అనధికారిక రంగాల నుంచి డేటాను కలపడం ద్వారా జిడిపి గణనలో స్పష్టత ఉండదని చెప్పారు. కాబట్టి, స్థూల జిడిపి డేటా కోసం అధికారిక, అనధికారిక రంగాలు ఎలా మిళితం చేయబడతాయో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమని అన్నారు.

మోడీ పాలనలో సర్వేల ప్రక్రియ నిలిపివేత

వాస్తవానికి, అంచనాల కారణంగా, ఇంతకుముందు కూడా ఇందులో తప్పులు జరిగాయని నిపుణులు గుర్తు చేశారు. కానీ కాలానుగుణంగా, ఈ అంచనాలు తనిఖీ చేయబడ్డాయనీ, అనధికారిక రంగం అంటే కంపెనీయేతర వ్యాపారాల జాతీయ సర్వే నిర్వహించడం ద్వారా సరిదిద్దబడ్డాయని చెప్పారు. అంతేకాకుండా, సాధారణ ఆర్థిక గణన, వినియోగదారుల వ్యయ సర్వే, ఉపాధి సర్వే మొదలైనవి కూడా గణాంక గణనలను ధృవీకరించడంలో చాలా వరకు సహాయపడిందని చెప్పారు. కానీ మోడీ ప్రభుత్వం ఈ సర్వేల ప్రక్రియను నిలిపివేసిందన్నారు. "13 ఏళ్లుగా కంపెనీయేతర ఆక్రమణ సర్వే చేయలేదు. 9 ఏళ్లుగా ఆర్థిక గణన జరగలేదు. వినియోగదారుల వ్యయం, ఉపాధి సర్వేలు 12 సంవత్సరాల క్రితం జరిగాయి" అని చెప్పారు.

అమెరికా పోలీసుల దురహంకారం

వాషింగ్టన్ : నల్లజాతి వారిపై తెల్ల పోలీసుల దురహంకార చర్యలకు తాజాగా మరో వ్యక్తి బలయ్యారు. దొంగతనానికి పాల్పడ్డారని అనుమానించిన కేసులో గర్భవతి అయిన 21ఏళ్ల నల్లజాతి మహిళను ఓహియో పోలీసులు కాల్చి చంపారు. గత నెల 24న ఈ ఘటన జరిగింది. తకియా యంగ్‌గా బాధితురాలిని గుర్తించారు. కారులో నుండి బయటకు వచ్చేందుకు ఆ యువతి తిరస్కరించడంతో ఒక పోలీసు అధికారి ఆమెపై కాల్పులు జరిపినట్లు ఓహియో పోలీసులు విడుదల చేసిన వీడియోలో కనిపిస్తోంది. ఆమె చౌర్యానికి పాల్పడిందని ఆ పోలీసు అధికారి అనుమానించాడని, ఇంటరాగేషన్ కోసం కారు నుంచి ఆమెను బయటకు రావాల్సిందిగా కోరాడని కొన్ని మీడియా వార్తలు పేర్కొన్నాయి. నల్ల సీడాన్ కారులో కూర్చున్న ఆ యువతిని బయటకు రావాల్సిందిగా పోలీసు అధికారి పదే పదే పట్టుబట్టడం బ్లెండన్ టౌన్‌షిప్ పోలీసు విభాగం విడుదల చేసిన వీడియోలో కనిపిస్తోంది. ఆమె బయటకు రావడానికి తిరస్కరించింది. దాంతో వారిమధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. 'నువ్వు దొంగతనం చేశావు, ఇక్కడ నుంచి వెళ్లలేవు' అని ఆ పోలీసు అధికారి పేర్కొనగా, నేను దొంగతనం చేయలేదంటూ ఆ యువతి తిరస్కరించింది. ఈలోగా పోలీసు అధికారుల్లో ఒకరు కారును ఆపి, తన తుపాకిని తీసి ఆమెను బయటకు రావాల్సిందిగా బెదిరించాడు. ఆ యువతి కారు స్టార్ట్ చేయడానికి ప్రయత్నించగానే వెంటనే ఆ అధికారి కాల్పులు జరిపాడు. ఆ వెంటనే కారు ముందుకు దూసుకెళ్లి కిరాణా దుకాణం గోడను కొట్టుకుని ఆగిపోయింది. నవంబరులో ఆమె బిడ్డకు జన్మనివ్వనుంది.

ప్రభుత్వ ప్రాజెక్టుగా అదానీ విద్యుత్!

- శ్రీలంక ప్రయత్నాలు

కొలంబో : శ్రీలంకలోని ఉత్తర ప్రావిన్స్‌లో పునర్వినియోగ ఇంధన ప్రాజెక్టును అమలు చేయడానికి అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రెండు ప్రభుత్వాలు భారత్, శ్రీలంకల మధ్య కుదుర్చుకున్న ఒప్పందంగా మార్చాలని శ్రీలంక ఇంధన శాఖ మంత్రి కోరినట్లు శ్రీలంక మీడియా తెలిపింది. మన్నార్‌లో 40కోట్ల అమెరికన్ డాలర్ల విలువైన, 500 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు కోసం అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌తో కుదిరిన ఒప్పందాన్ని రెండు ప్రభుత్వాల మధ్య కుదుర్చుకున్న ఒప్పందంలా మార్చాలని గత నెలలో శ్రీలంక కేబినెట్ కోరిందని కొలంబో నుంచి వెలువడే వార్తాపత్రిక ది సండే టైమ్స్ ఆదివారం పేర్కొంది. ఇటీవల శ్రీలంక విద్యుత్, ఇంధన శాఖ మంత్రి కంచనా విజేశేఖర ఈ మేరకు ఒక మెమొరాండాన్ని రూపొందించారు.

ఇదిలావుండగా, మన్నార్, పూనిరియాన్‌ల్లో పునర్వినియోగ ఇంధన అభివృద్ధి ప్రాజెక్టును అదానీ గ్రూపునకు ఇవ్వాలన్న నిర్ణయంపై కొన్ని వర్గాలు ఆందోళన వ్యక్తం చేసినట్లు ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్ ఫస్ట్ పేర్కొంది. అంతర్జాతీయ జర్నలిస్టుల నెట్‌వర్క్ అయిన ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఒసిసిఆర్‌పి) నిర్వహించిన దర్యాప్తు నేపథ్యంలో అదానీ గ్రూపుపై అంతర్జాతీయ మీడియా పరిశీలన జరుగుతున్న సమయంలోనే ఈ వార్తలు వెలువడ్డాయి.

జమిలీకి గుబులే కారణమా..?

(మొదటి పేజీ తరువాయి)

సానుకూలత, ఆదరణ పెరుగుతోంది. బిజెపికి వ్యతిరేకంగా లోక్‌సభ ఎన్నికలలో ఉమ్మడి అభ్యర్థిని నిలపాలని ముంబయిలో జరిగిన సమావేశంలో కూటమి నిర్ణయించింది. ఇది అధికారపక్షానికి గుబులు పుట్టిస్తోంది. అయితే ఏ పార్టీ పోటీ చేయాలి, ఏ ప్రాతిపదికన అభ్యర్థిని నిలపాలి అనే విషయాలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ అంశాలపై సమన్వయ కమిటీ నిర్ణయం తీసుకోవటానికి ఇంకా సమయం పడుతుంది. ఈ సమయంలో ప్రతిపక్షాలకు ఇవ్వకూడదనేది బిజెపి ఎత్తుగడగా తెలుస్తోంది.

అధిక ధరకు కొనుగోళ్ళు

(మొదటి పేజీ తరువాయి)

రానున్న రోజుల్లో అదనంగా వెచ్చించాల్సిన పరిస్థితి తప్పదు. ఇప్పటికే పీక్ అవర్లో అత్యవసరంగా కొన్ని సంస్థల నుండి యూనిట్ రూ.15 వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని ఎపిఇఆర్‌సికి పంపిన ప్రతిపాదనల్లో ప్రస్తావించడం గమనార్హం. రానున్న రోజుల్లో అవసరమైతే ఇంకా ఎక్కువ ధర చెల్లించైనా విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి డిస్కమ్‌లు సిద్ధమౌతున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో సరఫరాలో లోటుపాట్లు ఉంటే ప్రభుత్వానికి చెడ్డపేరు తప్పదని, ఆ పరిస్థితి రాకూడదనే ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అయితే, ఎంత ఎక్కువకు విద్యుత్ కొనుగోలు చేసినా దాన్ని ఎప్పటికప్పుడు వినియోగదారుల నుండి వసూలు చేసుకునేందుకు సరఫరా సంస్థలకు అనుమతి ఉంది ఈ మేరకు రెగ్యులేటరీ కమిషన్లకు కూడా స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అంటే ఆ భారం చివరకు ప్రజలపైనే పడుతుంది.

మీకోసం

స్టీలు డబ్బాలు, కప్‌బోర్డులపై పడిన జిడ్డు మరకలు పోవాలంటే ఒక కర్చీఫ్‌లో కొంచెం బియ్యం, అందులో టూత్ పౌడర్ వేసి మూటలా కట్టుకోవాలి. ఈ మూటతో వాటిపై రుద్దాలి. తరువాత మెత్తని వస్త్రంతో మరోసారి రుద్దితే మరకలు పోతాయి.

జీవన సౌరభం

ఉత్తమమైన వ్యక్తిని రూపొందించడమే విద్య పరమార్థం. అది గొప్ప ఉపాధ్యాయుల చేతిలో ఉంది.

పిల్లలూ, మీకు తెలుసు కదా? ఈ రోజు ఉపాధ్యాయ దినోత్సవం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజైన ఈ రోజే ఎందుకు జరుపుకుంటున్నామో తెలుసా?

బహుముఖ ప్రజ్ఞాశాలి సర్వేపల్లి

తిరుత్తణిలో తమిళనాడుకు వలస వెళ్లిన తెలుగు దంపతులు సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులకు 1888 సెప్టెంబరు 5న రాదాకృష్ణన్ జన్మించారు. ఆయన బాల్యం, విద్యాభ్యాసం ఎక్కువగా తిరుత్తణిలోనే గడిచాయి. తిరుపతి, నెల్లూరులలో కూడా విద్యాభ్యాసం సాగింది. మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చదివి ఎం.ఏ పట్టా పొందారు. 18 ఏళ్ల వయసులో శివకామమ్మతో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు. చాలాపేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఉన్నత విద్య చదివే స్థోమత లేక ఉపకార వేతనాలతోనే విద్యాభ్యాసం కొనసాగించారు. అరిటాకు కొనలేని పరిస్థితుల్లో నేలను శుభ్రపరచుకొని భోజనం చేసిన సందర్భాలు ఉన్నాయి.

ఇరవై ఏళ్ల వయసులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బోధకుడిగా చేరారు. అతను పాఠం చెప్పే తీరు విద్యార్థుల్లో ఎంతో ఆసక్తి కలిగించేది. రోజులో 12 గంటల.పాటు పుస్తకాలు చదువుతూనే ఉండేవారు. ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధన పత్రాలను రాశారు. ఆంధ్రా, బెనారస్ విశ్వవిద్యాలయాల్లో ఉప కులపతి (వైస్ ఛాన్సలర్)గా పనిచేశారు. రష్యాలో భారత రాయబారిగా కూడా పనిచేశారు. ఆయన రాసిన 'ఇండియన్ ఫిలాసఫీ' ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రత్యేక ఆహ్వానంపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రసంగించారు కూడా. 'యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్'లో సభ్యుడిగా ఉండి, విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. 16 సార్లు నోబెల్ సాహిత్య బహుమతికి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి ఆయన నామినేట్ అయ్యారు. 1952 నుంచి 1962 మధ్య ఉప రాష్ట్రపతిగా, 1962 నుంచి 1967 వరకూ రాష్ట్రపతిగా పనిచేశారు.

ఉపాధ్యాయులందరూ ఇప్పటికీ గర్వంగా చెప్పుకునే ఓ సంఘటన రాధాకృష్ణన్ ఉపాధ్యాయ జీవితంలో జరిగింది. మైసూర్‌లోని మహారాజా కళాశాల నుంచి రాధాకృష్ణన్ బదిలీ అయినప్పుడు- విద్యార్థులు ఆయన్ని అందంగా ముస్తాబు చేసిన గుర్రపు బండిపై ఊరేగించాలని భావించారు. సర్వేపల్లిని కూడా ఒప్పించారు. అయితే సమయానికి గుర్రం కనిపించకుండా పోయింది. అప్పుడు విద్యార్థులు తమ భుజాలపై రాధాకృష్ణన్‌ను ఊరేగింపుగా రైల్వే స్టేషన్ వరకు తీసుకెళ్లి వీడ్కోలు పలికారు.

గొప్ప అధ్యాపకుడిగా, మానవతావాదిగా, తత్వవేత్తగా, రచయితగా, రాజనీతిజ్ఞుడిగా సర్వేపల్లి ప్రస్థానం బహుముఖాలుగా సాగింది. భారత ప్రభుత్వం ఆయనను 'భారతరత్న' పురస్కారంతో గౌరవించింది. అధ్యాపకుడిగా జీవితం ప్రారంభించి, రాష్ట్రపతిగా ఎదిగిన ఆయన కృషికి గుర్తింపుగా ఆయన పుట్టిన రోజైన సెప్టెంబరు 5వ తేదీని 1962 నుంచి ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

నేను గీసిన బొమ్మ

- కులశేఖర్, 10వ తరగతి, జెడ్‌పి హైస్కూలు, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చేతితో తాకి, సమస్య తెలుసుకుంటారు!

సరైన అవగాహన లేక, సకాలంలో గుర్తించక మనదేశంలో ఏటా వేలాది మంది బ్రెస్ట్ కేన్సర్‌తో ప్రాణాలు కోల్పోతున్నారు. కీలకమైన ఈ సమస్యపై అవగాహన కోసం నేడు అనేక చోట్ల స్వీయ బ్రెస్ట్ పరీక్షలు చేసుకునేలా సెమినార్లు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. అలా ఇటీవల మదనపల్లిలో నిర్వహించిన ఓ మెడికల్ క్యాంపులో ఇద్దరు యువతులు సేవలు అందించారు. అక్కడికి వచ్చిన మహిళలు వీరిని చూసి చాలా ఆశ్చర్యపోయారు. ఏవిధమైన పరికరాలు ఉపయోగించకుండా కేవలం చేతితో తడుముతూ- వ్యాధి ఉన్నదీ లేనిదీ చెప్పేస్తున్న వారి వైపే.. కన్నార్పకుండా చూశారు. ఎందుకంటే- ఆ యువతులు ఇద్దరూ అంధులు.

నూరిన్నీసా డాక్టరు కావాలని బాల్యం నుండే కలలు కన్నది. కనీసం నర్సుగా అయినా సేవలు అందించాలనుకుంది. అయితే వైద్య విద్యలో అంధులకు ప్రవేశం లేకపోవడం వల్ల పుట్టుకతోనే అంధురాలైన నూర్‌కు తన ఆశ నెరవేరలేదు. అందుకే సాధారణ డిగ్రీలో చేరింది. అయితే తన కల చెదిరిపోయిందని ఎప్పుడూ దిగులు పడలేదు. చదువు పూర్తయిన తరువాత మెడికల్ టాక్టైల్ ఎగ్జామినర్ (ఎంటిఇ)గా శిక్షణ పొందింది. 'డిస్కవరింగ్ హ్యాండ్స్ ప్రోగ్రామ్'లో భాగంగా సకాలంలో రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు మహిళలను పరీక్షించే ఎంటిఇలో శిక్షణ తీసుకుంది.

'నేను ఇటీవల కర్నాటకలోని ఓ మారుమూల పల్లెలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొన్నాను. పరీక్షలు చేస్తూ.. ఈ స్వీయ పరిశీలన ఎందుకు ముఖ్యమో వారికి అవగాహన కల్పిస్తున్నాను. అప్పుడు అక్కడికి వచ్చిన మహిళలు నన్ను డాక్టర్ అని పిలిచారు. చాలా సంతోషమేసింది' అంటూ తనకు ఎదురైన అనుభవం గురించి చెప్పింది నూర్. నూర్ స్నేహితురాలు ఆయేషా కూడా అంధురాలే. వీరిద్దరూ ఈ ప్రోగ్రామ్‌లో శిక్షణ తీసుకున్న మొదటి బ్యాచ్ సభ్యులు.

ఈ కార్యక్రమ ఆలోచన చేసింది జర్మన్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఫ్రాంక్ హాఫ్‌మాన్. ఎలాంటి పరికరాలూ ఉపయోగించకుండా అంధులైన మహిళలను ఎంటిఇగా శిక్షణ ఇవ్వాలనుకోవడం వెనుక చాలా పెద్ద ఉద్దేశమే ఉంది. దృష్టి లోపం ఉన్న వారు వినికిడి పరంగానూ, స్పర్శ పరంగానూ చాలా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. ఎంటిఇ శిక్షణ తీసుకున్న అంధులు, 0.3 మిల్లీమీటర్ల కంటే తక్కువ సైజు కణితులను కూడా గుర్తిస్తున్నారు.

ఢిల్లీకి చెందిన 'నేషనల్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్' ఈ ప్రోగ్రామ్‌కి రూపకల్పన చేసింది.

ఇప్పటికి నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. మొదటిబ్యాచ్ విద్యార్థులైన నూర్, ఆయేషా బెంగళూరులోని సైటీకేర్ కేన్సర్ హాస్పటల్‌లో ఎంటిఇలుగా పనిచేస్తున్నారు. నూర్, ఆయేషాల ఈ ప్రయాణంలో తొలి అడుగు వేయించిన సంస్థ 'ఎనేబుల్ ఇండియా'. 'దృష్టిలోపం ఉన్న వాళ్ల తమ శక్తి సామర్థ్యాలు తెలుసుకునేలా వారి జీవన ప్రమాణాలు పెంచడం, విద్య వంటి వాటిలో ఉన్నత స్థానాలకు ఎదిగేలా చేయడంలో ఈ సంస్థ కృషి చేస్తోంది.

శిక్షణ తీసుకుంటున్న అమలాపురానికి చెందిన ఐశ్వర్య

శిక్షణ ఇలా ...

అసలు ఈ శిక్షణ ఎలా ఉంటుంది? అని ప్రశ్నించినప్పుడు - డిస్కవరీ హ్యాండ్స్ ప్రోగ్రామ్ నిర్వాహకులు అశ్వినీరావు ఇలా వివరించారు... :

'ఇది 9 నెలల ప్రోగ్రాం. ఇందులో ఆరు నెలల తరువాత థియరీ పరీక్ష కూడా నిర్వహిస్తాం. ఆ తరువాత గైనకాలజిస్ట్ లేదా ఆంకాలజిస్ట్ వద్ద ఇంటర్న్‌షిప్‌లో మూడు నెలలు శిక్షణ ఇప్పిస్తాం. శిక్షణ పూర్తయ్యాక 'ఎనేబుల్ ఇండియా' ద్వారా డాక్టర్ హాఫ్‌మన్ పర్యవేక్షణలో వారికి ప్రాక్టికల్ పరీక్ష ఉంటుంది. ఇలా శిక్షితులైన వారికి మహిళల పునరుత్పత్తి వ్యవస్థ, రొమ్ము కణజాలంపై కూడా అవగాహన కల్పిస్తాం. ఆ తరువాత మరో మూడు నెలల శిక్షణలో కంప్యూటర్ పరిజ్ఞానం, రోగులతో ఎలా ప్రవర్తించాలి, హాస్పటల్ ఫైల్స్ ఎలా నిర్వహించాలి వంటి విషయాలపై అవగాహన కల్పిస్తాం.'

పరీక్షలు ఎలా చేస్తారు?

ఈ విధానంలో మహిళలకు ఏ విధంగా పరీక్షలు నిర్వహిస్తారో ఆయేషా వివరించారు... : 'రోగులతో మేం పరిచయాలు పెంచుకుంటాం. వారి కుటుంబ చరిత్ర తెలుసుకుంటాం. మునుపటి శస్త్రచికిత్సల గురించి ఆరా తీస్తాం. ఏవైనా అనుమానాలు ఉంటే చెప్పమంటాం. ఆ తరువాత ఛాతీపై చర్మంలో ఏవైనా మార్పులు ఉన్నాయా అని అడుగుతాం. మెడ, కాలర్ ఎముకల వాపు, నొప్పి గురించి చెప్పమంటాం. చేతితో తడుముతూ ఒక్కోసారి రెండు వ్రేళ్లతో తాకుతూ బ్రెస్ట్ ఆకృతి, ఉష్ణోగ్రత వివరాలను తెలుసుకుంటాం. ఆ వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేస్తాం.'

'ఈ పరీక్షలో రోగులు ధైర్యంగా ఉండడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఆందోళనలో వారు సరిగ్గా పరీక్షకు సిద్ధంగా ఉండరు. కాబట్టి మేం వారితో చాలా స్నేహపూర్వకంగా మాట్లాడుతూ ఉంటాం' అని చెప్పారు నూర్.

నూర్, ఆయేషా 2019లో ఎనేబుల్ ఇండియాలో ఎంటిఇ శిక్షణ కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. కోవిడ్ లాక్‌డౌన్‌ల వల్ల ఆటంకాలు ఏర్పడి, 2022 నాటికి శిక్షణ పూర్తయింది. ఆ తరువాత సైటీకేర్ హాస్పటల్‌లో వివిధ విభాగాల్లో పనిచేశారు. ప్రస్తుతం పూర్తి కాలం కేన్సర్ గుర్తింపు ప్రోగ్రాంలో పనిచేస్తున్నారు.

డిజిటల్ రూపీతోనూ యుపిఐ చెల్లింపులు

- ఎస్‌బిఐ వెల్లడి

న్యూఢిల్లీ : డిజిటల్ రూపీ కరెన్సీ ద్వారా యుపిఐ లావాదేవీలు చేసుకునే సౌలభ్యాన్ని కల్పిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) వెల్లడించింది. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ లేదా డిజిటల్ రూపీతో క్యుఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపులు చేయవచ్చని పేర్కొంది. ఇ-రూపీ బై ఎస్‌బిఐ యాప్ ద్వారా ఈ ఫీచర్‌ను వాడుకోవచ్చని ఎస్‌బిఐ తెలిపింది. దీంతో ఎస్‌బిఐ ఇ-రూపీ యాప్ వాడుతున్న వారు ఇకపై డిజిటల్ లావాదేవీలు పూర్తి చేయొచ్చని పేర్కొంది. ఈ నిర్ణయంతో యుపిఐ లావాదేవీల కోసం క్యూఆర్ కోడ్‌లను వినియోగిస్తున్న వ్యాపారులు రోజువారీ వ్యాపార లావాదేవీల్లో ఇకపై డిజిటల్ రూపాయిని సైతం వినియోగించుకోవడానికి వీలుంటుందని తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2022 అక్టోబర్ 31న డిజిటల్ రుపీ పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. మొదట హోల్‌సేల్ విభాగంలో ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. తొమ్మిది బ్యాంకులు ఈ పైలట్ ప్రాజెక్ట్‌లో పాల్గొనడానికి ఆర్‌బిఐ అవకాశం కల్పించింది. వీటిలో ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, యెస్ బ్యాంక్, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్, హెచ్‌ఎస్‌బిసి బ్యాంకులున్నాయి.

విద్యుత్ సంక్షోభానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సరఫరా చేసి చిన్న మధ్య తరహా అత్యవసర ఉత్పత్తుల పరిశ్రమలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర విభజన అనంతరం మిగిలిన విద్యుత్తు ఈరోజు విద్యుత్ కోతలకు లోడ్ సెట్టింగ్లకు గురవటానికి విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలను అమలు చేయడమే కారణమని తెలిపారు. ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తిదారులకు లాభాలు కట్టబెట్టడానికే విద్యుత్ రేట్లు పెంచి వినియోగదారులపై భారం మోపుతున్నారని విమర్శించారు. అవసరం కోసం అత్యధిక రేట్లు పెట్టి కొనుగోలు చేసిన విద్యుత్తు భారాన్ని ప్రజలపై మోపవద్దని తెలిపారు. ప్రభుత్వమే సబ్సిడీని భరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం

- గిట్టుబాటు ధర కల్పిస్తాం
- యువగళం యాత్రలో నారా లోకేష్ హామీ

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి అధికారం చేపట్టిన వెంటనే ఆక్వా రైతులకు పెట్టుబడి తగ్గించి, గిట్టుబాటు ధర కల్పిస్తామని, ఆక్వా యూనివర్సిటీ, కోల్డ్ స్టోరేజ్‌లను నిర్మిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. విద్యుత్ యూనిట్ ఛార్జీని రూ.1.50 పైసలకు తగ్గించి 24 గంటలూ నాణ్యమైన విద్యుత్‌ను ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్‌తో సంబంధం లేకుండా అందిస్తామని చెప్పారు. ప్రపంచంలోనే మెరుగైన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చి ఆక్వారైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో 204వ రోజు సోమవారం కొనసాగింది. దీనిలో భాగంగా ఆక్వా రైతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. రొయ్యలు, చేపలు, రొయ్య సీడ్స్‌ను లోకేష్ పరిశీలించి ఆక్వా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, ఎంపి రామ్మోహన్‌నాయుడు, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.పాదయాత్రలో కోలమూరు గ్రామస్తులు లోకేష్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

నేపాల్‌పై భారత్ ఘన విజయం

- డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 10 వికెట్లతో గెలుపు
- నేపాల్ ఇన్నింగ్స్ 230/10

పల్లెకల్ : పల్లేకల్ : ఆసియా కప్‌లో భారత క్రికెట్ జట్టు తొలి విజయం నమోదు చేసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, సూపర్-4కు భారత్ దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నేపాల్ 48.2 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం భారత్ లక్ష్య ఛేదన సమయంలో 2.1 ఓవర్ల వద్దకు ఆటకు వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్ కొద్ది సేపు నిలిచిపోయింది. వర్షం తగ్గిన అనంతరం డక్‌వర్త్ లూయిస్ ప్రకారం భారత్ లక్ష్యాన్ని 23 ఓవర్లలో 145 పరుగులుగా నిర్దేశించారు. రోహిత్ శర్మ (74 పరుగులు), శుభమన్ గిల్ (67) ధాటిగా ఆడటంతో ఈ లక్ష్యాన్ని భారత్ 20.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా, 147 పరుగులు చేసి, ఇంకా 17 బంతులు మిగిలి ఉండగానే అందుకుంది.

ఈ మ్యాచ్‌లో ముందుగా ప్రపంచ క్రికెట్ అగ్రజట్టు, సూపర్‌స్టార్స్‌తో నిండిన టీమ్ ఇండియాపై చారిత్రక వన్డేలో నేపాల్ అద్వితీయ ప్రదర్శన చేసిందని భావించాలి. ఇటీవల భారత్-ఏతో మ్యాచుల్లో కనీస పోటీ ఇవ్వలేకపోయిన నేపాల్ జాతీయ జట్టు.. తాజాగా ఆసియా కప్ గ్రూప్-ఏ మ్యాచ్‌లో విశేషంగా ఆకట్టుకుంది. ఓపెనర్లు ఆసిఫ్ షేక్ (58, 97 బంతుల్లో 8 ఫోర్లు), కుశాల్ బి (38, 25 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), సోంపాల్ కామి (48, 56 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) స్ఫూర్తిదాయక ప్రదర్శన చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ టాప్, లోయర్ ఆర్డర్ రాణించటంతో 48.2 ఓవర్లలో 230 పరుగులు చేసింది. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (3/61), రవీంద్ర జడేజా (3/40) మూడేసి వికెట్లు పడగొట్టారు.

ఔరా నేపాల్..! : టాస్ నెగ్గిన టీమ్ ఇండియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పాక్‌తో వర్షార్పణమైన మ్యాచ్‌లో భారత బౌలర్లకు అవకాశం చిక్కలేదు. దీంతో నేపాల్‌పై తొలుత బౌలింగ్ చేయాలని నిర్ణయించారు. కొత్త బంతితో పేసర్లు మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్‌లు అవకాశాలు సృష్టించినా.. ఫీల్డర్లు నిరాశపరిచారు. తొలి ఐదు ఓవర్లలోనే ఏకంగా మూడు క్యాచులు నేలపాలయ్యాయి. అందివచ్చిన జీవనదానాలతో నేపాల్ ఓపెనర్లు కదం తొక్కారు. భారత బౌలర్లను ఎదుర్కొని 100 పరుగులైనా చేస్తుందా? అనే అనుమానాలు చవిచూసిన నేపాల్ ఏకంగా 48.2 ఓవర్ల పాటు వికెట్లను కాపాడుకుని 230 పరుగులు చేసింది.

పాడెను మోస్తున్న జి.ఓబులు, ఎం.ఇంతియాజ్ తదితరులు

పోలా రామాంజనేయులుకు తుదివీడ్కోలు

- అంత్యక్రియల్లో పాల్గొన్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకులు పోలా రామాంజనేయులుకు వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు తుదివీడ్కోలు పలికారు. అంతకుముందు అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణంలోని ఆయన స్వగృహం నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర బత్తలపల్లి రోడ్డులోగల శ్మశానవాటిక వరకు సాగింది. వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఈ యాత్రలో పాల్గొన్నారు. 'జోహార్ పోలా రామాంజనేయులు.. జోహార్.. జోహార్" అంటూ నినదించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తదితరులు రామాంజనేయులు పాడెను మోశారు. చేనేత, ప్రజా ఉద్యమానికి పోలా రామాంజనేయులు మృతి తీరని లోటని నాయకులు తెలిపారు. భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు సందర్శించి నివాళులు అర్పించారు.

పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు ఆత్మహత్యాయత్నం

- సంతకంపెట్టేందుకు వచ్చి గొంతు కోసుకున్న వైనం

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

పలు చోరీ కేసులలో నిందితుడిగా ఉన్న ఓ యువకుడు పోలీస్‌స్టేషన్‌లో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బాపట్ల జిల్లా చీరాల పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. ఒకటో పట్టణ సిఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం ఈపూరుపాలేనికి చెందిన ఇమ్మంది వెంకటేశ్వర్లు సుమారు ఎనిమిది దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇటీవల వైర్ల దొంగతనం కేసులో జామీనుపై జైలు నుంచి బయటకు వచ్చాడు. ప్రతి రోజూ స్టేషన్‌కు వెళ్లి సంతకం పెట్టాలని షరతులతో కూడిన బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. సంతకం చేసేందుకు సోమవారం స్టేషన్‌కు వెళ్లాడు. బెయిల్‌కు సంబంధించిన కోర్టు ఆర్డర్ కాపీ రావాలని, అప్పటి వరకూ వరండాలో కూర్చోవాలని వెంకటేశ్వర్లుకు సిఐ చెప్పాడు. సిఐ ఛాంబర్ నుంచి బయటకు వచ్చిన ముద్దాయి తన వద్ద ఉన్న బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. పోలీసులు వెంటనే ఆయనను స్థానిక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులను బెదిరించాలనే ఉద్దేశం, పాత కేసుల నుంచి తప్పించుకునేందుకు నిందితుడు ఈ చర్యకు పాల్పడినట్లు సిఐ తెలిపారు.

కాంస్యం ఖాయం!

- సెమీస్‌లో మెన్స్ జట్టు
- టిటి ఆసియా చాంపియన్‌షిప్స్

పియాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా) : టేబుల్ టెన్నిస్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత పురుషుల జట్టు పతకం ఖాయం చేసుకుంది. సోమవారం జరిగిన మెన్స్ టీమ్ క్వార్టర్‌ఫైనల్లో టీమ్ ఇండియా 3-0తో సింగపూర్‌పై గెలుపొందింది. మెన్స్ జట్టు విభాగంలో సెమీఫైనల్లోకి ప్రవేశించిన భారత్.. కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకుంది. టీమ్ ఈవెంట్ తొలి మ్యాచ్‌లో వెటరన్ అచంట శరత్ కమల్ అదరగొట్టాడు. 11-1, 10-12, 11-8, 11-13, 14-12తో ఐజాక్ క్వెక్‌పై ఐదు గేముల్లో అద్భుత విజయం సాధించాడు. టైబ్రేకర్‌కు దారితీసిన పోరులో 41 ఏండ్ల శరత్ కమల్ పైచేయి సాధించాడు. మరో సింగిల్స్‌లో జ్ఞానశేఖరన్ సతియన్ సైతం మెరుపు విజయం నమోదు చేశాడు. 11-6, 11-8, 12-10తో కోయెన్ పాంగ్‌పై వరుస గేముల్లో గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో యువ ప్యాడ్లర్ హర్మీత్ దేశాయ్ 11-9, 11-4, 11-6తో జె యు క్లారెన్స్‌పై ఏకపక్ష విజయం నమోదు చేశాడు. దీంతో భారత్ 3-0తో సింగపూర్‌ను చిత్తు చేసింది. మూడో సీడ్ టీమ్ ఇండియా నేడు సెమీఫైనల్లో ఇరాన్, చైనీస్ తైపీ క్వార్టర్‌ఫైనల్ విజేతతో సెమీఫైనల్లో తలపడనుంది. గత ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత మెన్స్ జట్టు కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే. ఇక, మహిళల జట్టు క్వార్టర్‌ఫైనల్లో అమ్మాయిల నిరాశపరిచారు. జపాన్‌తో క్వార్టర్స్‌లో భారత్ 0-3తో తేలిపోయింది. వరల్డ్ నం.8 మిమ 11-7, 15-13, 11-8తో అహిక ముఖర్జీపై గెలుపొందగా.. వరల్డ్ నం.36 మనిక బత్ర 7-11, 9-11, 11-9, 3-11తో వరల్డ్ నం.7 హినా హయత చేతిలో ఓడింది. మరో మ్యాచ్‌లో సుతీర్థ ముఖర్జీ 11-7, 4-11, 6-11, 5-11తో పరాజయం పాలైంది. 5-8 స్థానాల కోసం నేడు జరిగే క్లాసిఫికేషన్ మ్యాచుల్లో భారత మహిళల జట్టు ఆడనుంది.

కుమార్ హంతకులను అరెస్టు చేయాలి

- దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - సత్యవేడు (తిరుపతి)

ఆలయ హుండీ ఆదాయంలో తమ దళితవాడకు వాటా కావాలని అడిగిన తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాచపాళానికి దళిత యువకుడు కుమార్‌ను హత్య చేసిన పెత్తందారులను అరెస్టు చేయాలని దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. హత్య జరిగి నాలుగు నెలలు కావస్తున్నా నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం సత్యవేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం, సిపిఐ నాయకులు చిన్నిరాజ్ మాట్లాడారు. కుమార్‌ను చంపిన హంతకులను అరెస్టు చేయడంలో శ్రీసిటీ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. హంతకులను అరెస్టు చేయకుంటే జిలా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో విసికె నాయకులు శాంసన్, అరుణ్, అంబేద్కర్ ఆర్మీ నాయకులు రాజా, యతీస్‌రాజ్, ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68